# లక్ష యువగళ గీతార్చన



## విశ్వ హిందూ పరిషత్

మరియు

ధార్మిక, సాంస్కృతిక, సామాజిక, విద్యాసంస్థల

**సౌజన్యంతో**


తిరుమల తిరుపతి దేవస్థానముల వారి సౌజన్యంతో



## భారత రాష్ట్రపతి శ్రీరామ్‌నాథ్ కోవింద్ గారి సందేశము

శ్లో॥ యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥ 4:7 ॥

శ్లో॥ పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥ 4:8 ॥

"ధర్మమార్గములో ప్రవర్తించే సజ్జనులను సదా కాపాడుటకు, అధర్మంగా సంచరించే వారిని నశింపచేసేటందుకు" సమాజంలో ధర్మమును పునఃస్థాపన చేయుటకు ఆయా సమయములలో అవతరిస్తానని శ్రీకృష్ణ భగవానుడు అర్జునునికి ఇచ్చిన సందేశము స్ఫూర్తిగా నవసమాజ నిర్మాణానికి యువత నడుము బిగించి ముందుకు సాగాలని తేది 14 డిసెంబర్ 2021న గీతాజయంతినాడు భాగ్యనగరములో నిర్వహించే **'లక్ష యువగళ గీతార్చన'** కార్యక్రమమును పురస్కరించుకొని భారత రాష్ట్రపతి శ్రీమాన్ రామ్‌నాథ్ కోవింద్‌గారు వారి సందేశంలో పేర్కొన్నారు.

శ్రీమతే నారాయణాయ నమః                                    శ్రీమతే రామానుజాయ నమః





జై శ్రీమన్నారాయణ



## శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారి మంగళాశాసనములు

శ్లో॥ అస్థాన స్నేహ కారుణ్య ధర్మాధర్మధియాకులమ్ ।
పార్థం ప్రపన్న ముద్దిశ్య శాస్త్రావతరణం కృతమ్ ॥

**తా॥ తగనిచోట, తగని సమయములో స్నేహకారుణ్య మోహవశుడైన అర్జునుడు ధర్మమును అధర్మముగాను, అధర్మమును ధర్మముగాను పొరబడిన సందర్భములో సందేహనివృత్తికై శ్రీకృష్ణభగవానుడు ఉపదేశించినదే ఈ గీతాశాస్త్రము.**

శ్రీమాన్ యామునాచార్యులనే మహానుభావులు భగవద్గీత ఎందుకు? ఎలా ఉద్భవించింది? అనే రహస్యాన్ని వివరించారు. ఈ రోజు సమాజములో చదువులు ఉన్నాయి, ధనము, ఉద్యోగాలు ఉన్నాయి. కాని చేయవలసిన కర్తవ్యము ఏమిటి? అనే దానిపై స్పష్టత లేదు. సమాజంలో సంపాదన పెరిగింది, భోగాలు పెరిగాయి సంపాదించే వారు సంపాదిస్తున్నారు, ఖర్చు చేసేవారు ఖర్చు చేస్తున్నారు. కానీ మానవునికి తాను చేసే పనులపై పూర్తి విశ్వాసము కలుగుటలేదు.

పాఠశాల, కళాశాల విద్యార్థులను జీవితంలో మీరు ఏమి సాధించాలను కుంటున్నారు?, మీ లక్ష్యము ఏమిటి? అని అడిగినప్పుడు సరిగా సమాధానము చెప్పలేకపోతున్నారు. ప్రస్తుత విద్యావిధానములో విద్యార్థులను లక్ష్యసాధన దిశగా ప్రేరణ కలిగించే అంశాలు లేకపోవడం విచారకరము.

ఇలాంటి స్థితే ఒకనాడు అర్జునునకు కలిగింది. ఏది ధర్మము, ఏది అధర్మము (చేయవలసిన పని ఏమిటి – చేయకూడని పని ఏమిటి) అనే సందేహముతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు.

మానవుడు కర్తవ్యమును ఆచరించకపోవడం వలన కలిగే నష్టము కంటే, కర్తవ్యము కానిదానిని కర్తవ్యముగా భ్రమపడి చేస్తే, దానివలన చేసేవ్యక్తితో పాటు సమాజానికి కూడా నష్టము కలుగుతుంది.

కౌరవులు ఎన్నో అక్రమాలు చేసి ప్రజలను విపరీతమైన వేదనలకు గురిచేసి దుష్టపాలన సాగించారు. పరిపాలనా దక్షత కలిగిన పాండవులకు రాజ్యాధికారము దక్కలేదు. అర్జునునికి అధర్మాన్ని అణచగల శక్తిసామర్థ్యాలు ఉన్నప్పటికి బంధుమోహము వంటి అనవసర ఆలోచనలు చుట్టుముట్టి కర్తవ్య విముఖునిగా చేసి, యుద్ధరంగము నుండి వెనుతిరుగుదామా అనే భావనను కలిగించాయి. తన బంధువర్గము మరియు ఆచార్యులపైన యుద్ధము చేయడం అధర్మముగా భావించాడు. ఘోర అపరాధముల కారణముగా దండనార్హులయిన వ్యక్తులను క్షమించడం ధర్మము కాదు అన్న విచక్షణ అర్జునునకు ఆ సమయంలో నశించింది.

అవసరం కానిచోట స్నేహాన్ని, కారుణ్యాన్ని చూపితే అధర్మమును ధర్మముగా, ధర్మమును అధర్మముగా పొరబడే అవకాశములు ఎక్కువ. ఏది చేయతగినది–ఏది చేయతగనిది అనే ధర్మసంకటాన్ని నివృత్తిచేసి శ్రీకృష్ణభగవానుడు అర్జునుని కర్తవ్యోన్ముఖుని గావించాడు.

ఈరోజు సమాజములో మంచిని చెడుగాను, చెడును మంచిగాను భ్రమింప చేసే వాతావరణంలో అత్యధిక శాతం జనులు జీవిస్తున్నారు. భగవద్గీత ఉపదేశితమైన కాలానికేగాక ఎల్లకాలాలకు, విశ్వజనులకు సర్వకార్యాలలో యుక్తాయుక్త విచక్షణను కలిగించే శాస్త్రరాజము.

సమాజాన్ని సంస్కరించే ధ్యేయంతో భగవద్గీతలోని 40 శ్లోకాలను ఎంపికచేసి ఒక మాలగా కూర్చి యువతకు స్ఫూర్తికలిగించి, దేశభవితను తీర్చిదిద్దే లక్ష్యంతో తేది 14 డిసెంబర్ 2021న గీతాజయంతి సందర్భంగా **'లక్ష యువగళ గీతార్చన'** కార్యక్రమము రూపొందించడము ముదావహము. సమాజానికి దేశానికి ప్రయోజనకరముగా యువత తయారు కావాలని ఆకాంక్షిస్తూ ఎల్లరకూ అనేకానేక మంగళాశాసనములు.




శ్లో॥ సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాల నందనః ।
పార్థోవత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥

తా॥ ఉపనిషత్తులన్నింటిని గోవులుగా చేసుకొని వాటి అమృతమువంటి సారమనే 'గీతాక్షీరాన్ని' అర్జునుడనే 'లేగదూడ' మాధ్యమంగా చేసుకొని లోకమునందలి మంచి బుద్ధిగల వారందరికి గోపాలనందనుడు పంచియున్నాడు.

## భగవద్గీత రత్నమాల

భారతీయ యువత (15 నుండి 40 సంవత్సరముల వయస్కులు) లోని ఆధ్యాత్మిక జ్ఞానశక్తిని, క్రియాశక్తిని మేలుకొల్పి ఆత్మస్థైర్యముగల ధీమంతులుగా తీర్చిదిద్దుటకు భగవద్గీతలో ఎంపిక చేసిన అత్యంత భావస్ఫోరకమైన మండల(40) శ్లోకాలను లక్ష మంది యువతచే పారాయణ చేయించాలని మహాత్ములు నిర్ణయించారు.

'లక్ష యువగళ గీతార్చన' కార్యక్రమములో పాల్గొనే యువతకు మా విన్నపము ఏమనగా, పారాయణ చేయవలసిన మండల శ్లోకములను ముందుగా అధ్యయనము చేసి భావస్ఫూర్తిని పొంది, భావార్థాన్ని హృదయస్థము చేసుకుంటే కంఠస్థము చేయుట సులభమౌతుంది. కంఠస్థమైన భావస్ఫూర్తి ఆజన్మాంతము వెన్నంటి ఉండి ధైర్యవంతులుగా వివిధ రంగాలలో అభివృద్ధి పథంలో పయనించుటకు ఉపకరిస్తుంది.

మండల శ్లోకాలు ఎవరికి వారు స్వయముగా అధ్యయనము చేయుటకు అనుకూలముగా 'పంచాధ్యయన పద్ధతి' (భావచిత్రము, పదవిభాగము, ప్రతిపదార్థము, తాత్పర్యము, విశేషార్థము) తో కూడిన పాఠ్యప్రతులను రూపొందించడము జరిగినది. ఈ పాఠ్యప్రతులు లక్ష యువగళ గీతార్చనలో పాల్గొనే వారందరికి విశ్వహిందూ పరిషత్ వారి ద్వారా అందజేయబడతాయి. సకాలంలో పాఠ్యప్రతులు అందనివారు అంతర్జాలములో www.gitarchana.com ద్వారా పొందే అవకాశము కూడా కలదు.

**విన్నపము :**

లక్ష యువగళ గీతార్చన కార్యక్రమ నిర్వహణలో మీ యోగదానము ఆశిస్తున్నాము. మీ సమర్పణ ఈ క్రింద చూపిన బ్యాంక్ అకౌంటు కు లేదా ఫోన్ పే లేదా గూగుల్ పే నెంబరుకు పంపవలసిందిగా అభ్యర్థిస్తున్నాము.

బ్యాంక్ పేరు : బ్యాంక్ ఆఫ్ బరోడా,

బ్యాంక్ శాఖ : అబిడ్స్, హైదరాబాద్.

అకౌంట్ నెంబరు : **05110100018754**

IFSC Code : BARB0HYDERA

గమనిక : ఇక్కడ '0' అనగా సున్నా

గూగుల్ పే/ఫోన్ పే నెంబర్ : **6309982878**

వలిశెట్టి లక్ష్మీ శేఖర్, కోశాధికారి,

ఫోన్ నెంబరు : 9866035557

SCAN AND PAY

# యువత పారాయణ చేయవలసిన శ్లోకములు

అథ.. ధ్యానం... ఓం...

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోప శాంతయే ॥

వసుదేవ సుతం దేవం కంసచాణూర మర్దనమ్ ।
దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

అథ.. శ్రీమద్భగవద్గీతా... ఓం...

శ్రీభగవాన్ ఉవాచ

1. క్లైబ్యం మా స్మ గమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే
క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప ॥ 2:3 ॥

2. జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ ।
తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి ॥ 2:27 ॥

3. కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన ।
మా కర్మఫలహేతుర్భూః మా తే సంగో ఽస్త్వకర్మణి । 2:47 ।

4. దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః ।
వీతరాగ భయ క్రోధః స్థితధీర్మునిరుచ్యతే ॥ 2:56 ॥

5. ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూపజాయతే ।
సంగాత్ సంజాయతే కామః కామాత్ క్రోధో ఽభిజాయతే ॥ 2:62 ॥

6. క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతివిభ్రమః ।
స్మృతి భ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ ప్రణశ్యతి ॥ 2:63 ॥

7. యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః ।
స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే ॥ 3:21 ॥

8. శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్ ।
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః । 3:35 ।

9. యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥ 4:7 ॥

10. పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥ 4:8 ॥

11. బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।
బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా ॥ 4:24 ॥

12. జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశితమాత్మనః ।
తేషామాదిత్యవత్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్ ॥ 5:16 ॥

13. ఉద్ధరే దాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్ ।
ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః ॥ 6:5 ॥

14. యుక్తాహార విహారస్య యుక్తచేష్టస్య కర్మసు ।
యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా ॥ 6:17 ॥

15. అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్ ।
అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే ॥ 6:35 ॥

16. పార్థ నైవేహ నాముత్ర వినాశస్తస్య విద్యతే ।
న హి కల్యాణకృత్ కశ్చిత్ దుర్గతిం తాత గచ్ఛతి ॥ 6:40 ॥

17. మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే ।
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః ॥ 7:3 ॥

18. బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే ।
వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః ॥ 7:19 ॥

19. అంతకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కలేబరమ్ ।
యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః ॥ 8:5 ॥

20. ఆబ్రహ్మ భువనాల్లోకాః పునరావర్తినోఽర్జున ।
మాముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే ॥ 8:16 ॥

21. అనన్యా శ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ । 9:22 ॥

22. పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।
తదహం భక్త్యుపహృతమ్ అశ్నామి ప్రయతాత్మనః ॥ 9:26 ॥

23. అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయ స్థితః ।
అహమాదిశ్చ మధ్యం చ భూతానామంత ఏవ చ ॥ 10:20 ॥

24. యద్యద్విభూతిమత్ సత్త్వం శ్రీమదూర్జితమేవ వా ।
తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశసంభవమ్ ॥ 10:41॥

25. భక్త్యా త్వనన్యయా శక్య అహమేవంవిధోఽర్జున ।
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప ॥ 11:54 ॥

26. మత్కర్మకృత్ మత్పరమో మద్భక్తస్సంగవర్జితః ।
నిర్వైరస్సర్వ భూతేషు యస్స మామేతి పాండవ ॥ 11:55 ॥

27. అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ ।
నిర్మమో నిరహంకారః సమ దుఃఖసుఖః క్షమీ ॥ 12:13 ॥

28. సంతుష్టస్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః ।
మయ్యర్పిత మనోబుద్ధిః యో మద్భక్త స్స మే ప్రియః ॥ 12:14 ॥

29. సర్వతః పాణిపాదం తత్ సర్వతోఽక్షి శిరోముఖమ్ ।
సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి ॥ 13:13 ॥

30. సమం పశ్యన్ హి సర్వత్ర సమవస్థిత మీశ్వరమ్ ।
న హినస్త్యాత్మ నాత్మానం తతో యాతి పరాం గతిమ్ ॥ 13:28 ॥

31. మానావమానయోస్తుల్యః తుల్యో మిత్రారి పక్షయోః ।
సర్వారంభ పరిత్యాగీ గుణాతీతః స ఉచ్యతే ॥ 14:25 ॥

32. శరీరం యదవాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః ।
గృహీత్వైతాని సంయాతి వాయుర్గంధానివాశయాత్ । 15:8 ॥

33. అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః ।
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥ 15:14 ॥

34. త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః ।
కామః క్రోధస్తథా లోభః తస్మాదేతత్త్రయం త్యజేత్ । 16:21 ॥

35. తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ ।
జ్ఞాత్వా శాస్త్ర విధానోక్తం కర్మ కర్తుమిహార్హసి ॥ 16:24 ॥

36. అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్ ।
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయమ్ తప ఉచ్యతే । 17:15 ॥

37. యజ్ఞ దాన తపః కర్మ న త్యాజ్యం కార్యమేవ తత్ ।
యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్ ॥ 18:5 ॥

38. యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్ ।
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః ॥ 18:46 ॥

39. సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥ 18:66 ॥

సంజయ ఉవాచ

40. యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ।
తత్ర శ్రీర్విజయో భూతిః ధ్రువా నీతిర్మతిర్మమ॥ 18:78 ॥

ఓం అసతోమా సద్గమయ

తమసోమా జ్యోతిర్గమయ

మృత్యోర్మా అమృతంగమయ

ఓం శాంతిః శాంతిః శాంతిః

సర్వం శ్రీ కృష్ణార్పణమస్తు

ఓం... తత్... సత్...

భగవద్గీతలోని మరిన్ని చిత్రాలకు ఈ క్రింది వెబ్‌సైట్‌ను దర్శించండి.
www.bhagavadgitabhavachitrasudha.com

**శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।**
**ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోప శాంతయే ॥**

ప్రతిపదార్థము: **శుక్లం** = తెల్లని, **అంబరం** = వస్త్రము, **ధరం** = ధరించినవాడు, **విష్ణుం** = విశ్వమంతా వ్యాపించినవాడు, **శశివర్ణం** = చంద్రుని వంటి తేజము కలవాడు, **చతుర్భుజమ్** = నాలుగు చేతులు కలవాడు, **ప్రసన్నవదనం** = ప్రసన్నముఖుని, **సర్వవిఘ్నోపశాంతయే** = సమస్తమైన అడ్డంకులను తొలగించాలని, **ధ్యాయేత్** = ధ్యానించుచున్నాను.

**తాత్పర్యము:** తెల్లని వస్త్రములు ధరించినవాడు, విశ్వమంతా వ్యాపించినవాడు, చంద్రుని వంటి తేజము కలవాడు, నాలుగు చేతులు కలవాడు, ప్రసన్నవదనుడు, సర్వ విఘ్నములను తొలగించు వినాయకుని ధ్యానించుచున్నాను.

**వసుదేవ సుతం దేవం కంసచాణూర మర్దనమ్ ।**
**దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుమ్ ॥**

ప్రతిపదార్థము: **వసుదేవసుతం** = వసుదేవుని పుత్రుడు, **కంసచాణూర మర్దనమ్** = కంస చాణూరులను సంహరించినవాడు, **దేవకీ పరమానందం** = దేవకీ దేవికి పరమానందదాయకుడు, **జగద్గురుమ్** = జగత్తు అంతటికి గురువు, **దేవం** = భగవంతుడైన, **కృష్ణం** = శ్రీకృష్ణభగవానునికి, **వందే** = నమస్కరించుచున్నాను.

**తాత్పర్యము:** వసుదేవపుత్రుడు, కంస చాణూరులను సంహరించినవాడు, దేవకీదేవికి పరమానందాన్ని కలిగించేవాడు, జగద్గురువైన శ్రీకృష్ణపరమాత్మకి నమస్కరించుచున్నాను.

**నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।**
**దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥**

ప్రతిపదార్థము: **నారాయణం** = దేవాదిదేవుడైన శ్రీమన్నారాయణునకు, **నరం చైవ** = నరుల మనస్సులే నివాసస్థానమైన, **నరోత్తమమ్** = నరోత్తముడైన శ్రీకృష్ణపరమాత్మకు, **దేవీం సరస్వతీం** = సరస్వతీ దేవికి, **వ్యాసం** = వ్యాస భగవానునకు, **నమస్కృత్య** = నమస్కరించిన, **తతో** = అనంతరము, **జయముదీరయేత్** = శ్రీమహాభారతము చదువవలెను / చెప్పవలెను.

**తాత్పర్యము:** నరుల మనస్సులే నివాసస్థానమైన నారాయణునకు నరోత్తముడైన శ్రీకృష్ణపరమాత్మకు, సరస్వతీదేవికి వ్యాస భగవానునకు నమస్కరించిన అనంతరము శ్రీ మహాభారతమును చదువవలెను / చెప్పవలెను.

పదునెనిమిది పర్వముల శ్రీ మహాభారతములోని ఆరవ పర్వమైన భీష్మ పర్వములో శ్రీకృష్ణపరమాత్మచే అర్జునునికి బోధింపబడిన 700 శ్లోకముల ఆధ్యాత్మజ్ఞాన కర్తవ్యబోధయే శ్రీమద్భగవద్గీత.




**శ్లోకం :** **క్లైబ్యం మా స్మ గమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే**
**క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప ॥2.3॥**

**పదవిభాగము :** క్లైబ్యం, మా, స్మ, గమః, పార్థ, న, ఏతత్, త్వయి, ఉపపద్యతే
క్షుద్రం, హృదయదౌర్బల్యం, త్యక్త్వా, ఉత్తిష్ఠ, పరంతప

**ప్రతిపదార్థము :** **పార్థా!** = ఓ అర్జునా!, **క్లైబ్యం** = అధైర్యము/నపుంసకత్వము, **మా స్మ గమః** = పొందకుము, **త్వయి** = నీయందు, **ఏతత్** = ఈ అధైర్యము, **న ఉపపద్యతే** = తగినది కాదు, **పరంతపా!** = శత్రువులను పీడించే వీరుడా!, **క్షుద్రం** = నీచమైన, **హృదయదౌర్బల్యం** = పిరికితనము, **త్యక్త్వా** = విడిచి, **ఉత్తిష్ఠ** = లెమ్ము!

**తాత్పర్యము :** ఓ అర్జునా!, నీవు అధైర్యమును పొందకుము. అధైర్యము పొందుట ధీరుడవైన నీకు తగదు. ఓ శత్రువులను పీడించే వీరుడా! అతి నీచమైన హృదయదౌర్బల్యమును వీడి యుద్ధమునకు సిద్ధము కమ్ము!

**విశేషార్థము :** ధర్మబద్ధమైన కార్యనిర్వహణకు పూనుకున్న వారికి మానసిక బలహీనత నిస్సత్తువను కలిగిస్తుంది. ధర్మానుష్ఠాననిష్ఠ కలిగిన ధీరులు, కార్యశూరులు పిరికితనమును మనస్సు లోనికి ప్రవేశించకుండా జాగ్రత్త పడవలెనని సర్వమానవులను ఉద్దేశించి భగవానుడు ప్రబోధించు చున్నాడు.

భారతీయ సనాతన తత్త్వసారాన్ని స్వామి వివేకానంద అమెరికా, ఇగ్లండు దేశాలలో ప్రపంచ మానవజాతిని ఉద్దేశించి **"సోదర సోదరీమణులారా! ('క్షుద్రం' 'హృదయదౌర్బల్యం') నీచమైన మానసిక బలహీనతను విడిచి, ఇక కర్తవ్యోన్ముఖులు కండి"** అంటూ సింహనాదం చేశాడు. ఈ భగవద్గీత సింహనాదం శ్రీఅరవింద్ ఘోష్, తిలక్, ఠాగూర్, మహాత్మాగాంధీ వంటి ఎందరో స్వాతంత్ర్య యోధులకు కర్తవ్య దీక్షను ఉపదేశించినది.




**శ్లోకం : జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ ।**
**తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి ॥ 2:27 ॥**

**పదవిభాగము:** జాతస్య, హి, ధ్రువః, మృత్యుః, ధ్రువం, జన్మ, మృతస్య, చ, తస్మాత్, అపరిహార్యే, అర్థే, న, త్వం, శోచితుం, అర్హసి

**ప్రతిపదార్థము:** **హి** = ఏలనన, **జాతస్య** = పుట్టినవానికి, **మృత్యుః** = మరణం, **ధ్రువః** = నిశ్చయము (తప్పదు), **మృతస్య** = మరణించినవానికి, **జన్మ చ** = పుట్టుక, **ధ్రువం** = నిశ్చయము, **తస్మాత్** = అందువలన, **అపరిహార్యే** = తప్పింప శక్యముకాని, **అర్థే** = విషయము గూర్చి, **త్వం** = నీవు, **శోచితుం** = దుఃఖించడానికి, **న అర్హసి** = అర్హుడవు కావు.

**తాత్పర్యము:** పుట్టినవానికి మృత్యువు తప్పదు. మరణించినవానికి పునర్జన్మ తప్పదు. కాబట్టి తప్పింప శక్యముకాని ఈ విషయాన్ని గూర్చి దుఃఖించుట నీకు తగదు.

**విశేషార్థము:** యథార్థముగా ఆత్మకు చావు పుట్టుకలు లేవు. ఈ శ్లోకము సామాన్యుల దృష్టిని అనుసరించి చెప్పబడినది. ఏ ప్రాణి అయినను మరణము నుండి తప్పించుకొనుటకు వీలుకాదు. మృతి చెందిన ప్రతి ప్రాణికి తన కర్మను అనుసరించి పునర్జన్మ పొందుట నిశ్చితము. ఆత్మజ్ఞానము పొందిన వారికి పునర్జన్మ లేదు. ఆత్మజ్ఞానము కలుగనంత వరకు ప్రాణులకు జననమరణ చక్రభ్రమణము తప్పింప శక్యము కాదని భగవానుని వచనము.




**శ్లోకం : కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన ।**
**మా కర్మఫలహేతుర్భూః మా తే సంగోఽస్త్వకర్మణి । 2:47 ।**

**పదవిభాగము:** కర్మణి, ఏవ, అధికారః, తే, మా, ఫలేషు, కదాచన, మా, కర్మ ఫలహేతుః, భూః, మా, తే, సంగః, అస్తు, అకర్మణి

**ప్రతిపదార్థము:** **కర్మణి ఏవ** = కర్మాచరణలో, **తే** = నీకు, **అధికారః** = ఆసక్తి కలుగు గాక!, **కదాచన** = ఎన్నడూ, **ఫలేషు** = దానిఫలములందు ఆసక్తి, **మా అస్తు** = కలుగకుండు గాక!, **కర్మఫలహేతుః** = కర్మఫలాలకు కారణభూతుడవు, **మా భూః** = కావలదు, **అకర్మణి** = కర్మలు చేయకుండుటయందు, **తే** = నీకు, **సంగః**= ఆసక్తి, **మా అస్తు** = కలుగకుండు గాక!.

**తాత్పర్యము:** అర్జునా ! నీకు కర్తవ్య కర్మ చేయుటకే అధికారము (యోగ్యత) ఉంది. (సన్యాసమునకు లేదు). కర్మఫల విషయములో మాత్రము నీకు ఎన్నడూ అధికారము లేదు. అట్లని కర్మలు చేయకుండా ఉండరాదు. ఫలాపేక్షరహితముగా కర్తవ్యతా బుద్ధితో కర్మలు ఆచరించవలెనని భావము.

**విశేషార్థము:** మానవుడు కర్మఫలముపై కోరికతో కర్మలయందు ప్రవర్తించుచూ కర్మఫల రూపమగు మరోజన్మకు కారకుడు అగుచున్నాడు. ప్రతిఫలాపేక్ష లేకుండా చేయు కర్మల వలన అంతఃకరణ శుద్ధి కలిగి ఆత్మజ్ఞానము ఉదయించును. (చిత్రంలో వృద్ధుడు నాటుచున్న మామిడి మొక్క ఫలసాయము ఇచ్చే వరకు తాను జీవించి యుండనని తెలిసినప్పటికి, భావితరాల హితార్థమై కర్తవ్య దృష్టితో చేయు 'నిష్కామకర్మ' ఉదాహరణగా చూపబడినది)




**శ్లోకం : దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః ।**
**వీతరాగ భయ క్రోధః స్థితధీర్మునిరుచ్యతే ॥ 2:56 ॥**

**పదవిభాగము:** దుఃఖేషు, అనుద్విగ్నమనాః, సుఖేషు, విగతస్పృహః, వీతరాగభయక్రోధః, స్థితధీః, మునిః, ఉచ్యతే

**ప్రతిపదార్థము:** **దుఃఖేషు** = దుఃఖములు ప్రాప్తించినప్పుడు, **అనుద్విగ్నమనాః** = మనస్సునందు ఉద్వేగమునకు లోనుకానివాడు (క్రుంగిపోనివాడు), **సుఖేషు** = సుఖములు కలిగినప్పుడు, **విగతస్పృహః** = ఆసక్తిరహితులు (పొంగిపోనివారు), **వీతరాగ భయ క్రోధః** = అనురాగము, భయము, క్రోధము పోయినవాడైన, **మునిః** = ముని (మననశీలుడు), **స్థితధీః** = స్థితప్రజ్ఞుడు అని, **ఉచ్యతే** = చెప్పబడుచున్నాడు.

**తాత్పర్యము:** కష్టములు కలిగినప్పుడు మనస్సులో దిగులు చెందనివాడు, సుఖములపై ఆసక్తి లేనివాడు,రాగము (ప్రాపంచిక విషయాలపై అత్యాసక్తి) భయము, కోపము లేనివాడైన మునిని స్థితప్రజ్ఞుడని (అచంచలమైన జ్ఞానము కలవాడని) అందురు.

**విశేషార్థము:** సాధకునికి సాధనలో ఉన్న కష్టమంతా వశముకాని ఇంద్రియములతోనే, కోరికలతో సంచరించే ఇంద్రియ విషయాలను వశములో ఉంచుకొనుటయే **'ప్రజ్ఞ.'** ఇంద్రియాలను వశము చేసుకొని అంతర్ముఖము చేసుకొనుటయే **'స్థితప్రజ్ఞ'** లక్షణము. సుఖములు ప్రాప్తించినప్పుడు అగ్ని యందు ఆజ్యము (నెయ్యి) వేసినప్పుడు ప్రజ్వలించే అగ్నివలె కోరికలు వృద్ధి చెందకుండా వాటి యందు ఆసక్తిరహితుడై రాగము, భయము, క్రోధమును నశింపచేసుకోవాలి. శుభం ప్రాప్తించినప్పుడు సంతోషం, అశుభం ప్రాప్తించినప్పుడు ద్వేషము లేకుండా మనస్సును ఆత్మ యందే స్థిరముగా నిలిపినటువంటి మునిని **'స్థితప్రజ్ఞుడ'**ని అంటారు.




**శ్లోకం :** **ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూపజాయతే ।**
**సంగాత్ సంజాయతే కామః కామాత్ క్రోధోఽభిజాయతే ॥ 2:62 ॥**

**పదవిభాగము:** ధ్యాయతః, విషయాన్, పుంసః, సంగః, తేషు, ఉపజాయతే, సంగాత్, సంజాయతే, కామః, కామాత్, క్రోధః, అభిజాయతే

**ప్రతిపదార్థము:** **విషయాన్** = శబ్దాది ఇంద్రియ విషయములను, **ధ్యాయతః** = చింతన చేయునట్టి, **పుంసః** = పురుషునకు, **తేషు** = ఆ శబ్దాది విషయములందు, **సంగః** = ఆసక్తి (ప్రీతి), **ఉపజాయతే** = ఏర్పడును, **సంగాత్** = ప్రీతి వలన, **కామః** = కోరిక, **సంజాయతే** = కలుగుచున్నది. **కామాత్** = కోరిక వలన (ఆ కోరిక తీరనప్పుడు), **క్రోధః** = కోపము, **అభిజాయతే** = పుట్టుచున్నది.

**తాత్పర్యము:** ఇంద్రియ విషయములను గూర్చి ఆలోచించిన కొలదీ మనుజునకు వాటియందు ఆసక్తి పెరుగుతుంది. ఆసక్తి వలన విషయములను పొందవలెననే కోరిక పుడుతుంది. కోరిక తీవ్రము అగుటవలన దానిని పొందుటలో ఏదైనా ఆటంకము కలిగితే కోపము పుట్టుకొస్తుంది.

**విశేషార్థము:** కామక్రోధములు పరస్పర మిత్రులవలె మనస్సుయందు సంచరించుచూ 'అగ్నికి వాయువు తోడైనప్పుడు అవి సమస్త వస్తువులను ఎట్లు దహించివేయునో' అట్లే ఈ కామక్రోధములు మనుజుని పూర్తిగా నశింపచేయును. కావున సాధకులు కామక్రోధాదుల స్వభావమును సత్వరమే గ్రహించి, మనస్సునందు వాటికి తావీయక జాగ్రత్త వహించవలెను.




**శ్లోకం :** **క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతివిభ్రమః ।**
**స్మృతి భ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ ప్రణశ్యతి ॥ 2:63 ॥**

**పదవిభాగము:** క్రోధాత్, భవతి, సమ్మోహః, సమ్మోహాత్, స్మృతి విభ్రమః, స్మృతిభ్రంశాత్, బుద్ధినాశః, బుద్ధినాశాత్, ప్రణశ్యతి

**ప్రతిపదార్థము:** **క్రోధాత్** = కోపము వలన, **సమ్మోహః** = అవివేకము, **భవతి** = కలుగుచున్నది, **సమ్మోహాత్** = అవివేకము వలన, **స్మృతివిభ్రమః** = మతిభ్రమ కలుగుచున్నది (మరుపు), **స్మృతిభ్రంశాత్** = మతిభ్రమ వల్ల, **బుద్ధినాశః** = బుద్ధి (జ్ఞానశక్తి) నశించును, **బుద్ధినాశాత్** = బుద్ధిబలము నశించుట వలన, **ప్రణశ్యతి** = పురుషార్థానికి అయోగ్యుడు అవుతాడు.

**తాత్పర్యము:** కోపము అవివేకమును (మంచి–చెడు తెలియని స్థితిని) కలిగిస్తుంది. అవివేకము వల్ల జ్ఞాపకశక్తి నశిస్తుంది. జ్ఞాపకశక్తి నశించడంతో బుద్ధి నశిస్తుంది. బుద్ధి నశిస్తే మానవుడు నశిస్తాడు.

**విశేషార్థము:** క్రోధము వలన జ్ఞాపకశక్తి లోపించిన మానవుడు '**కర్తవ్య–అకర్తవ్యము**'లను నిర్ణయించుకోలేని స్థితి ఏర్పడును. ఈ స్థితియందు మానవుడు నిత్య జీవితములో కఠినత్వము, జడత్వము, హింస, ప్రతిహింస, మూఢత్వము మొదలగు అవలక్షణములతో జీవించి మానవుడు సాధింపవలసిన ధర్మ, అర్థ, కామ, మోక్షములనే చతుర్విధ పురుషార్థాలను సాధించుటకు అయోగ్యుడై అధోగతి పొందును. క్రోధము వలన మనుజునికి భౌతికముగా కన్నులు ఎర్రబడును. ఉచ్ఛ్వాస నిశ్వాసలు అధికమగును. ఈ లక్షణములను సాధకులు గమనించి క్రోధము మనస్సులో ప్రవేశించకుండా జాగ్రత్త వహించవలెను.




**శ్లోకం : యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః ।**
**స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే ॥ 3:21 ॥**

**పదవిభాగము:** యత్, యత్, ఆచరతి, శ్రేష్ఠః, తత్, తత్, ఏవ, ఇతరః, జనః, సః, యత్, ప్రమాణం, కురుతే, లోకః, తత్, అనువర్తతే

**ప్రతిపదార్థము:** **శ్రేష్ఠః** = ఉత్తముడైనవాడు, **యత్ యత్** = ఏ ఏ కర్మను, **ఆచరతి** = ఆచరించునో, **ఇతర జనః** = సాధారణ జనులు, **తత్ తత్ ఏవ** = అట్టి కర్మనే (అనుకరించును) **సః** = అతడు **యత్ ప్రమాణం** = దేనిని ప్రమాణముగా, **కురుతే** = చేయునో (స్వీకరించునో), **లోకః** = ప్రపంచము, **తత్** = దానిని, **అనువర్తతే** = అనుసరించుచున్నది.

**తాత్పర్యము:** ఉత్తముడు ఏ ఏ కర్మలను ఆచరించునో ఇతరులు కూడా అవే కర్మలను ఆచరిస్తారు. ఇట్టి ఉత్తముడు ఆచరించు కర్మ లౌకిక కర్మ అయినా, వైదిక కర్మ అయినా అతడు దేనిని ప్రమాణముగా గ్రహిస్తాడో, ప్రపంచ జనులు కూడా దానినే ప్రమాణముగా భావించి అనుసరించెదరు.

**విశేషార్థము:** మహాత్ములైన వారి మనోశక్తి, ప్రవర్తన సామాన్యుల కన్నా విలక్షణముగా ఉండును. జ్ఞాని అయిన మహాపురుషుని ఆచరణను చూచియే లోకములోని ఇతర జనులు ఆచరింతురు. కావున శ్రేష్ఠపురుషుడు తాను జ్ఞానార్జన కొరకు కర్మ చేయవలసిన అవసరము లేనప్పటికి ఇతరులను మంచి మార్గములో నడిపించుటకు వారు కర్మలు చేయుదురు. లోకోద్ధరణమే వీరి జీవితాశయమై యుండును.




**శ్లోకం :** శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్ ।

స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః । 3:35 ।

**పదవిభాగము:** శ్రేయాన్, స్వధర్మః, విగుణః, పరధర్మాత్, స్వనుష్ఠితాత్, స్వధర్మే, నిధనం, శ్రేయః, పరధర్మః, భయావహః

**ప్రతిపదార్థము:** **స్వ అనుష్ఠితాత్** = చక్కగా ఆచరింపబడిన, **పరధర్మాత్** = ఇతరుల ధర్మము కంటెను, **విగుణః** = గుణరహితమే అయినను, **స్వధర్మః** = తన ధర్మమైన కర్మయోగమే, **శ్రేయాన్** = మిక్కిలి మేలు చేయునది, **స్వధర్మే** = తన ధర్మమైన కర్మయోగము నందు, **నిధనం** = మరణమైనను, **శ్రేయః** = కళ్యాణకరమే, **పరధర్మః** = ఇతరుల ధర్మము, **భయావహః** = భయము కలుగజేయునది.

**తాత్పర్యము:** తనదైన ధర్మము (స్వభావసిద్ధముగా తాను నిర్వర్తింపవలసిన కర్తవ్యము) కొన్ని లోపములతో ఆచరింపబడుతున్నప్పటికి ఎక్కువ ప్రశస్తమైనది. స్వధర్మాచరణములో మరణము సంభవించినా అది కళ్యాణకరమే. ఇతరుల ధర్మము మంచి ఉద్దేశముతో ఆచరింపబడినను అది స్వధర్మము కంటే హీనమైనది. నరకాది రూపమైన భయాన్ని కలిగిస్తుంది.

**విశేషార్థము:** మానవులకు వారి వారి గుణకర్మలను అనుసరించి కర్తవ్యకర్మలు చెప్పబడినవి. వైదిక సనాతన ధర్మములు మానవులు అందరికీ స్వధర్మములు. సత్యభాషణము, ఈశ్వరభక్తి, మాతాపితల సేవలు, ఇంద్రియ సంయమము, అహింస, పరధనాపహరణ విముఖత, దయ, దానము, క్షమ మొదలగు సామాన్య ధర్మములు అందరికి స్వధర్మములు. **(అందరూ అనుష్ఠింపదగినవి)** అట్లే నిషిద్ధ కర్మలు దొంగతనము, వ్యభిచారము, అసత్యము, హింస, కపటం మొదలైనవి ఎవరికి స్వధర్మములు కావు. **(ఎవ్వరూ అనుష్ఠింపదగినవి కావు)**




**శ్లోకం : యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।**
**అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥ 4:7 ॥**

**పదవిభాగము:** యదా, యదా, హి, ధర్మస్య, గ్లానిః, భవతి, భారత, అభ్యుత్థానం, అధర్మస్య, తదా, ఆత్మానం, సృజామి, అహమ్

**ప్రతిపదార్థము:** **హే భారతా!** = భరత వంశములో పుట్టిన ఓ అర్జునా!, **యదా యదాహి** = ఏ ఏ సమయములందు, **ధర్మస్య** = ధర్మమునకు, **గ్లానిః** = పీడ (క్షీణదశ), **అధర్మస్య** = అధర్మమునకు, **అభ్యుత్థానం** = అభివృద్ధి, **భవతి** = అగుచున్నదో, **తదా** = అప్పుడు, **అహం** = నేను, **ఆత్మానం** = నన్ను, **సృజామి** = స్వయముగా సృష్టించుకొనుచున్నాను.

**తాత్పర్యము:** భరత వంశోద్భవుడవగు అర్జునా! ఎప్పుడైతే ధర్మం అణచివేయబడి, అధర్మం వృద్ధిచెంది ప్రాణుల అభ్యుదయానికి, శ్రేయస్సుకు భంగము వాటిల్లుతుందో, అప్పుడు మాయ ద్వారా నన్ను నేను సృష్టించుకొనుచున్నాను.

**విశేషార్థము:** **"ధర్మోరక్షతి రక్షితః"** ధర్మాన్ని రక్షిస్తే ఆ ధర్మమే అందరినీ రక్షిస్తుంది. భగవంతుడు అధర్మమును అణచుటకు, ధర్మమును ఉద్ధరించుటకు తాను సంకల్ప మాత్రము చేతనే సాకార రూపములో ఈ లోకములో అవతరించుచున్నాడు. ధర్మపరిరక్షణకు సాక్షాత్తు భగవంతుడే పూనిక వహించినప్పుడు ఆ దైవకార్యాన్ని పరమాత్మ స్వరూపులమైన మనమందరమూ, ఎవరికి నిర్దేశింపబడిన కర్తవ్యకర్మలు వారు చిత్తశుద్ధితో ఆచరించుట ద్వారా ధర్మపరిరక్షణ చేయవలెను. అధర్మమైన ఆలోచన ఎన్నడూ మనస్సు లోనికి ప్రవేశించకుండా జాగ్రత్త వహించవలెను.




**శ్లోకం : పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥ 4:8 ॥**

**పదవిభాగము:** పరిత్రాణాయ, సాధూనాం, వినాశాయ, చ, దుష్కృతామ్, ధర్మ సంస్థాపనార్థాయ, సంభవామి, యుగే, యుగే

**ప్రతిపదార్థము:** **సాధూనాం** = సాధుపురుషుల యొక్క, **పరిత్రాణాయ** = రక్షణార్థము, **దుష్కృతామ్** = దుష్టుల యొక్క, **వినాశయ** = వినాశనము కొరకు, **చ** = మరియు, **ధర్మసంస్థాపనార్థాయ** = ధర్మసంస్థాపన కొరకు, **యుగే యుగే** = ప్రతీ యుగంలో, **సంభవామి** = అవతరిస్తాను.

**తాత్పర్యము:** సన్మార్గములో నడిచే సత్పురుషులను రక్షించుటకు పాపకర్మలు చేసే దుర్మార్గులను నాశనం చేసి ధర్మాన్ని బాగుగా నిలుపుటకు ప్రతీ యుగములో నేను జన్మిస్తూ ఉంటాను.

**విశేషార్థము:** సర్వ శక్తిమంతుడు, సర్వేశ్వరుడు, పూర్ణబ్రహ్మము అగు భగవానుడు భక్తులను పాలించుటలో సర్వసమర్థుడు. ఈ శ్లోకములో ధర్మానుష్ఠానపరులై సత్ప్రవర్తన కలిగియుండు సాధుపురుషులు ఎల్లప్పుడూ రక్షించబడుతూ ఉంటారని భగవానుడు అభయమిచ్చుచున్నాడు.

**'దుష్టశిక్షణ, సాధు పరిరక్షణ, ధర్మ సంస్థాపన'** తన కర్తవ్యము కావున ధర్మమును సుస్థిరమొనర్చుటకు తన మాయచే ప్రతీ యుగమునందు అవతరించుచున్నాడు. పరమాత్మ అవతారములు అనంతములు. శ్రీమద్భాగవతములో శ్రీమహావిష్ణువు 21 అవతారములు ఎత్తినట్లుగా చెప్పబడినప్పటికి దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసిన దశావతారములే ప్రముఖముగా తత్త్వజ్ఞానులచే కీర్తింపబడినవి.




**శ్లోకం : బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।**
**బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా ॥ 4:24 ॥**

**పదవిభాగము:** బ్రహ్మ, అర్పణం, బ్రహ్మ, హవిః, బ్రహ్మాగ్నౌ, బ్రహ్మణా, హుతమ్, బ్రహ్మ, ఏవ, తేన, గంతవ్యం, బ్రహ్మకర్మ సమాధినా

**ప్రతిపదార్థము:** **అర్పణం** = యజ్ఞకర్మలయందు ఉపయుక్తములగు సుక్ స్రువములు (కొయ్యతో చేయబడిన గరిటెలు, ఆవునేతి పాత్రలు మొదలైనవి), **బ్రహ్మ** = బ్రహ్మ స్వరూపము, **హవిః** = ఘృతం (ఆవునెయ్యి), **బ్రహ్మ** = బ్రహ్మమే, **బ్రహ్మాగ్నౌ** = బ్రహ్మరూపమైన అగ్నిలో, **బ్రహ్మణా** = బ్రహ్మరూపమైన హోత (పురోహితుడు/ఋత్విక్కు) చేత, **హుతం** = హోమము చేయబడినదియును, **బ్రహ్మ** = బ్రహ్మమే, **తేన** = ఇట్టి, **బ్రహ్మకర్మ సమాధినా** = బ్రహ్మరూప కర్మయందు స్థితుడైన యోగి ద్వారా, **గంతవ్యం** = పొందదగినది (ఫలము) కూడా, **బ్రహ్మ ఏవ** = బ్రహ్మమే.

**తాత్పర్యము:** హోమ కార్యములందు ఉపయుక్తమగు సాధనములు అన్నియూ బ్రహ్మమే. హవిస్సు (హోమాగ్ని ద్వారా చేయు అర్పణక్రియ) హోమముచేయు హోత (ఋత్విక్కు/పురోహితుడు) హోమము చేయించు అధర్వుడు (యజమాని) కూడా బ్రహ్మమే అని తలంచవలయును. ఇట్టి యజ్ఞక్రియ ద్వారా ఏకాగ్రతను పొంది, బ్రహ్మభావము పొందినవాడు పొందు ఫలముకూడా బ్రహ్మమే.

**విశేషార్థము:** సర్వత్రా బ్రహ్మదర్శన రూప సాధనమగు యజ్ఞమును ఉదాహరణగా భగవానుడు తెలుపుచూ, యజ్ఞ ఉపకరణ సాధనములు సుక్స్రువములు, సమిధలు, నెయ్యి, అన్నాదులు, యజ్ఞకర్త, అగ్ని, అర్పణక్రియ, హవిస్సు అంతటిని పరమాత్మ భావనగా దర్శించిన వాని కర్మలు బ్రహ్మమే అగును. సృష్టి అంతయూ బ్రహ్మమయమే అనుచూ యజ్ఞము ద్వారా భగవానుడు ఉపనిషత్తుల సారమును వివరించుచున్నాడు.




**శ్లోకం :** **జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశితమాత్మనః ।**
**తేషామాదిత్యవత్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్ ॥ 5:16 ॥**

**పదవిభాగము:** జ్ఞానేన, తు, తత్, అజ్ఞానం, యేషాం, నాశితం, ఆత్మనః, తేషాం, ఆదిత్యవత్, జ్ఞానం, ప్రకాశయతి, తత్పరమ్

**ప్రతిపదార్థము:** **తత్** = అట్టి, **ఆత్మనః** = ఆత్మయొక్క, **అజ్ఞానం** = అజ్ఞానము, **యేషాం** = ఎవరి యొక్క, **ఆత్మనః జ్ఞానేన** = పరమాత్మ తత్త్వజ్ఞానము చేత, **నాశితం** = నశింపజేయబడునో, **తేషాం** = వారికి, **జ్ఞానము** = ఆ జ్ఞానము, **తత్పరమ్** = పరమార్థ తత్త్వమును, **ఆదిత్యవత్** = సూర్యునివలె (సూర్యుడు ఎట్లు సమస్త ప్రపంచమును ప్రకాశింపజేయుచున్నాడో), **ప్రకాశయతి** = దర్శింపజేయును.

**తాత్పర్యము:** ఆత్మతత్త్వము, సృష్టి తత్త్వము యొక్క వివేక జ్ఞానము ఎవరికి కలుగునో వారికి మోహము వలన జనించిన అజ్ఞానము తొలగిపోతుంది. అది ఎట్లు అంటే, గాలిచే మేఘము తొలగిన తరువాత సూర్యుడు ప్రకాశించినట్లుగా జ్ఞానము స్వయంప్రకాశ శీలమైనది. (పరమాత్మ స్వరూపమును ప్రత్యక్షమొనరించును)

**విశేషార్థము:** గాలి వీచునప్పుడు మేఘము తొలగిపోయి సూర్యుడు ప్రకాశించునట్లుగా, అజ్ఞానము ఆవరింపబడిన మానవునికి బ్రహ్మవిచారణ, ధ్యానాదులచే అజ్ఞానము తొలగిపోయి జ్ఞానము ఉదయించి సూర్యప్రకాశము సమస్త వస్తువులను ఎట్లు దర్శింపజేయునో అట్టి విధముగా సృష్టి తత్త్వము, పరమేశ్వర తత్త్వము సాధకునికి తెలియబడును.



**శ్లోకం : ఉద్ధరే దాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్ ।**
**ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః ॥ 6:5 ॥**

**పదవిభాగము:** ఉద్ధరేత్, ఆత్మనా, ఆత్మానం, న, ఆత్మానం, అవసాదయేత్ ।
ఆత్మా, ఏవ, హి, ఆత్మనః, బంధుః, ఆత్మా, ఏవ, రిపుః, ఆత్మనః ॥

**ప్రతిపదార్థము:** **ఆత్మనా** = వివేకమైన మనస్సుతో, **ఆత్మానం** = విషయ మాలిన్యావృతమైన మనస్సును, **ఉద్ధరేత్** = ఉద్ధరించుకొనవలయును, **ఆత్మానం** = మనస్సును, **న అవసాదయేత్** = అధోగతి పొందనివ్వకు, **హి** = ఎందువలన అనగా, **ఆత్మా ఏవ** =శుద్ధమైన మనస్సే, **ఆత్మనః** = జీవునికి, **బంధుః** = సహాయము చేసే మిత్రుడు, **ఆత్మా ఏవ** = ఇంద్రియాసక్తమైన మనస్సే, **ఆత్మనః** = జీవునికి, **రిపుః** = శత్రువు.

**తాత్పర్యము:** ఇంద్రియ విషయాసక్తమైన మనస్సును మానవుడు తన వివేకయుక్తమైన మనస్సుతో తనను తానే ఉద్ధరించుకొనవలయును. ఎన్నడూ ఇంద్రియ విషయాసక్తిని పొందకూడదు. శుద్ధమైన మనస్సే మనుజునికి యథార్థమైన హితాన్ని కోరే మిత్రుడు. విషయాసక్తే మనుజునికి కీడు చేయు పరమ శత్రువు.

**విశేషార్థము:** స్థూలదేహము కంటే కన్ను, ముక్కు, చెవి మొదలైన జ్ఞానేంద్రియములు శ్రేష్ఠమైనవి. జ్ఞానేంద్రియముల కంటే మనస్సు శ్రేష్ఠమైనది. చంచలమైన మనస్సుకన్నా, నిశ్చయాత్మకమైన బుద్ధి ఉత్తమమైనది. బుద్ధి కన్నా ఆత్మ శ్రేష్ఠమైనది. ఆత్మ యందు జ్ఞానశక్తి, క్రియాశక్తి అను సమిష్టి శక్తి కలదు. ప్రతివ్యక్తి తనలోని ఆత్మశక్తిని మేల్కొల్పి దానిని మిత్రునిగా చేసుకొని తనను తానే ఉద్ధరించుకోవాలని, మహాత్మునిగా మారవలెనని భగవానుని సందేశము.




**శ్లోకం : యుక్తాహార విహారస్య యుక్తచేష్టస్య కర్మసు ।**
**యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా ॥ 6:17 ॥**

**పదవిభాగము:** యుక్తాహారవిహారస్య, యుక్తచేష్టస్య, కర్మసు, యుక్తస్వప్నావబోధస్య, యోగః, భవతి, దుఃఖహా

**ప్రతిపదార్థము:** **యుక్త ఆహార విహారస్య** = పరిమితమైన (తగినంత) ఆహార విహారములు, **కర్మసు** = కర్మాచరణముల యందు, **యుక్తచేష్టస్య** = యోగ్యముగ ప్రవర్తించువాడు, **యుక్తస్వప్నావబోధస్య** = నిద్రయందును, మేల్కొండుటయందును యథాయోగ్యముగ ఉండు మానవునికి, **దుఃఖహా** = దుఃఖనాశనమగు, **యోగః** = ధ్యానయోగము, **భవతి** = సిద్ధించును.

**తాత్పర్యము:** తగు విధమైన మితాహారము, నడత (కర్మాచరణము/ సత్ప్రవర్తనము) తగు విధంగా తన శక్తికి లోబడి పనులు చేసేవానికి, తగు విధంగా నిద్రపోతూ, మేలుకొంటూ ఉండే యోగికి సమస్త దుఃఖములను నశింపజేసే **'ధ్యానయోగసిద్ధి'** ప్రాప్తిస్తుంది.

**విశేషార్థము:** తనకు అవసరమైనంత అన్న పరిమాణము మించి తినువానికి, పూర్తిగా ఏమి తినని వానికి, అతిగా నిద్రించువానికి, ఎప్పుడూ మేల్కొని ఉండువానికి, అధికశ్రమ చేయువానికి, ఏ పనీ చేయని వానికి సర్వ దుఃఖములను నశింపజేయు ధ్యానయోగసిద్ధి లభించదు. కావున ధ్యాన యోగ అనుష్ఠానపరుడైన యోగి పై శ్లోకములో భగవానునిచే చెప్పబడిన నియమములను తప్పక పాటించవలెను.




**శ్లోకం : అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్ ।**
**అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే ॥ 6:35 ॥**

**పదవిభాగము:** అసంశయం, మహాబాహో, మనః, దుర్నిగ్రహం, చలమ్, అభ్యాసేన, తు, కౌంతేయ, వైరాగ్యేణ, చ, గృహ్యతే

**ప్రతిపదార్థము:** **మహాబాహో** = గొప్ప బాహువులు గల మహావీరా!, **మనః** = మనస్సు, **చలమ్** = చంచల స్వభావము కలది, **దుర్నిగ్రహం** = నిగ్రహింప శక్యము కానిదే, **తు** = కాని, **కౌంతేయ!** = ఓ కుంతీపుత్రా!, **అభ్యాసేన, చ** = అభ్యాసము చేతను, **వైరాగ్యేణ** = వైరాగ్యము వలనను, **గృహ్యతే** = నిగ్రహించుట సాధ్యమే.

**తాత్పర్యము:** ఓ మహాబాహో! మనస్సు చంచలమైనది. నిగ్రహించుట కష్టము అనుటలో ఎట్టి సందేహము లేదు. అయినప్పటికీ ఓ కుంతీపుత్రా! అభ్యాస వైరాగ్యముల చేత మనస్సును వశము చేసుకొని పట్టు సడలకుండా ప్రయత్నించినట్లయితే మనస్సు నిగ్రహింపబడుతుంది.

**విశేషార్థము:** కృష్ణా ! మనస్సు చంచలమైనదే కదా ! గాలిని కట్టి ఉంచడం ఎంత కష్టమో మనస్సును అదుపులో పెట్టుకోవడం కూడా అటువంటిదేనని నాకు అనిపిస్తోంది. దానిని ఎలా నిగ్రహించాలి అని అర్జునుడు భగవానుని ప్రశ్నించగా భగవానుడు ఇట్లు ఉపదేశించుచున్నాడు.

ఓ మహాబాహుడవైన అర్జునా ! మనస్సు చంచలమైనదే. నిగ్రహింప శక్యము కానిదే. అట్టి దానిని వశము చేసుకోవటం కష్టము అన్న విషయంలో ఎట్టి సందేహము లేదు. అయినప్పటికీ **అభ్యాసము** (నిలకడలేని మనస్సును ఆత్మయందు స్థిరముగా నిలుపుటకు చేయు నిరంతర ప్రయత్నము అభ్యాసము) **వైరాగ్యము** (ప్రాపంచిక వస్తువుల యందు విరక్తి పొందుటయే వైరాగ్యము) అనే సాధనాలతో మనస్సును నిగ్రహింపవచ్చును.




**శ్లోకం :** **పార్థ నైవేహ నాముత్ర వినాశస్తస్య విద్యతే ।**
**న హి కల్యాణకృత్ కశ్చిత్ దుర్గతిం తాత గచ్ఛతి ॥ 6:40 ॥**

**పదవిభాగము:** పార్థ!, న, ఏవ, ఇహ, న, అముత్ర, వినాశః, తస్య, విద్యతే న, హి, కల్యాణకృత్, కశ్చిత్, దుర్గతిం, తాత!, గచ్ఛతి

**ప్రతిపదార్థము:** **పార్థా!** = ఓ అర్జునా!, **తస్య** = అట్టి యోగము నుండి భ్రష్టుడైనవానికి, **ఇహ** = ఈ లోకంలో, **వినాశః** = నాశనము, **న విద్యతే** = కలుగదు, **అముత్ర ఏవ** = పరలోకములో కూడా, **న** = వినాశము ఉండదు, **తాత** = తండ్రీ!, **కల్యాణకృత్** = మంచి పనులు చేయువాడు, **కశ్చిత్** = ఎవ్వడూ, **దుర్గతిం** = అధోగతి, **న గచ్ఛతి** = పొందడు.

**తాత్పర్యము:** పార్థా! యోగము నుండి భ్రష్టుడైనవానికి ఈ లోకములోకాని పరలోకములోకాని వినాశము లేదు. ఎందువలన అనగా తండ్రీ! ఆత్మోద్ధరణతో మంచి పనులు చేయువానికి ఎన్నడూ దుష్ఫలితములు కలుగవు.

**విశేషార్థము:** యోగము నందు ప్రవేశించి యోగసాధన చేస్తూ, యోగము నందు నిష్ణాతుడు కాకుండా మరణించిన లేక యోగము నుండి చలించి భ్రష్టుడైన మానవుడు ఎట్టి స్థితిని పొందుతాడు అని అర్జునుడు భగవానుని అడుగగా, లోకకల్యాణార్థమై కర్తవ్య దృష్టితో మంచి పనులు చేయు మానవుడు ఎన్నడూ ఈ లోకంలోగాని, పరలోకంలోగాని అధోగతి పొందడు అని భగవానుడు వివరించుచున్నాడు. కావున మంచి పనులు చేసిన వారికి ఫలితము ఉంటుందా! అనే విషయములో సాధకుల సందేహమునకు తావే లేదు.




**శ్లోకం : మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే ।**
**యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః ॥ 7:3 ॥**

**పదవిభాగము:** మనుష్యాణాం, సహస్రేషు, కశ్చిత్, యతతి, సిద్ధయే, యతతాం, అపి, సిద్ధానాం, కశ్చిత్, మాం, వేత్తి, తత్త్వతః

**ప్రతిపదార్థము:** **మనుష్యాణాం సహస్రేషు** = వేలకొలది మనుష్యులలో, **కశ్చిత్** = ఒకానొకడు మాత్రమే, **సిద్ధయే** = ఆత్మజ్ఞానసిద్ధికై, **యతతి** = ప్రయత్నించుచున్నాడు. **యతతాం** = అట్లు ప్రయత్నించుచున్న వారిలో, **సిద్ధానాం అపి** = సిద్ధి పొందిన యోగులలో కూడ, **కశ్చిత్** = ఏ ఒక్కడో, **మాం** = నన్ను, **తత్త్వతః** = నా యథార్థ స్వరూపమును, **వేత్తి** = తెలుసుకుంటున్నాడు.

**తాత్పర్యము:** ఓ అర్జునా! అనేక వేలమంది మనుష్యులలో సిద్ధి (మోక్షం) కొరకు ప్రయత్నము చేసేవాడు ఎవడో ఒక్కడు ఉంటాడు. అట్లు ప్రయత్నము చేయుచున్న సిద్ధులలో కూడా (మోక్షం కొరకు ప్రయత్నము చేసే అనేక వేల మంది మనుష్యులలో కూడా) ఏ ఒక్కడో మాత్రమే నన్ను యథార్థముగా తెలుసుకుంటున్నాడు.

**విశేషార్థము:** వేలకొలది జనులలో ఒకానొకడు మాత్రమే పరమాత్మ తత్త్వమును ఎరుంగుచున్నాడు. అంటే తక్కిన సాధకులు వ్యర్థులు అని చెప్పినట్లు కాదు. యోగ మార్గములలో జ్ఞానయోగ మార్గము క్లిష్టమైనది, కష్టసాధ్యమైనది. ఈ మార్గములో పరమాత్మప్రాప్తి పొందువారు చాలా అరుదు అని అర్థము.




**శ్లోకం : బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే ।**
**వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః ॥ 7:19 ॥**

**పదవిభాగము:** బహూనాం, జన్మనాం, అంతే, జ్ఞానవాన్, మాం, ప్రపద్యతే, వాసుదేవః, సర్వం, ఇతి, సః, మహాత్మా, సుదుర్లభః

**ప్రతిపదార్థము:** **బహూనాం** = అనేకములైన, **జన్మనాం** = జన్మముల యొక్క, **అంతే** = అంతమున (పిదప), **జ్ఞానవాన్** = భగవత్తత్త్వమును ఎరిగిన జ్ఞాని, **సర్వం** = సమస్తము, **వాసుదేవః ఇతి** = వాసుదేవమయమే అని భావించి, **మాం** = నన్ను, **ప్రపద్యతే** = భజించును, **సః, మహాత్మా** = అట్టి మహాత్ముడు, **సుదుర్లభః** = లభించుట అరుదు.

**తాత్పర్యము:** అనేక జన్మలు ఎత్తిన పిదప తత్త్వజ్ఞానాన్ని పొంది జ్ఞానియైనవాడు (పరమేశ్వర తత్త్వమును ఎరిగినవాడు) సర్వము వాసుదేవుడే అని ప్రత్యక్షముగా తెలుసుకుంటాడు. సర్వాత్మ స్వరూపుడు వాసుదేవుడే అని భావించు మహాత్ముడు మిక్కిలి దుర్లభుడు (లోకములో అరుదుగా ఉండునని భావము)

**విశేషార్థము:** **"బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్"** ఈ శ్లోకంలో అనేక జన్మలు ఎత్తిన పిమ్మట మాత్రమే మానవవుడు జ్ఞానము పొంది మోక్షమును పొందుచున్నాడని అర్థము కాదు. ఏ క్షణమున జ్ఞానమును పొందునో ఆ క్షణముననే మోక్షము లభించునని భావము. ఈ జన్మయందే మోక్షము పొందువారిని భగవానుడు **'మహాత్ముడు'** అని కొనియాడుచున్నాడు. సామాన్యులమైన మనము **'విశ్వమంతయూ ఏకాత్మ స్వరూపమే'** అనే విశాల దృష్టితో కర్మలు ఆచరించుచూ మహాత్ములుగా మార్పు చెందుటకు తీవ్ర ప్రయత్నము చేయవలెను.




**శ్లోకం : అంతకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కలేబరమ్ ।**
**యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః ॥ 8:5 ॥**

**పదవిభాగము:** అంతకాలే, చ, మాం, ఏవ, స్మరన్, ముక్త్వా, కలేబరమ్, యః, ప్రయాతి, సః, మద్భావం, యాతి, న అస్తి, అత్ర, సంశయః

**ప్రతిపదార్థము:** **యః** = ఎవడు, **అంతకాలే చ** = మృత్యు సమయములో, **మాం ఏవ** = నన్నే, **స్మరన్** = స్మరిస్తూ, **కళేబరం** = దేహమును, **ముక్త్వా** = త్యజించి, **ప్రయాతి** = పోవుచున్నాడో, **సః** = అతడు, **మద్భావం** = నా స్వరూపమునే, **యాతి** = పొందుచున్నాడు, **అత్రః** = ఈ విషయములో, **సంశయః** = సందేహము, **న అస్తి** = లేనే లేదు

**తాత్పర్యము:** కౌంతేయా! (కుంతీపుత్రా!) ఏ మానవుడు మరణ సమయములో పరమేశ్వరుడు విష్ణువునైన నన్నే స్మరించుచూ, దేహము త్యజించుచున్నాడో, అతడు నా యొక్క విష్ణు స్వరూపమును పొందుచున్నాడు. ఈ విషయములో ఎట్టి సందేహము లేదు.

**విశేషార్థము:** అంత్యకాలమున భగవన్నామము స్మరించినవాడు ఎంతటి పాపాత్ముడైననూ భగవంతుని చేత ఉద్ధరింపబడతాడు. అకస్మాత్తుగా ఎవరికి దైవచింతన కలుగదు. నిరంతరము దైవచింతన చేయువారికే అంత్యకాలమున దైవస్మరణ కలుగును. దైవచింతన కలవాడు ఘోరసంసార దుఃఖసాగరమును దాటి పునర్జన్మ రహితుడై ముక్తి నొందగలడు. ఇందు ఎవ్వరికి సందేహము అవసరము లేదని భగవానుడు స్పష్టపరచుచున్నాడు. (శ్రీమద్భాగవతములోని అజామిళో పాఖ్యానము ఉదాహరణగా చిత్రములో చూపబడినది.)




**శ్లోకం :** ఆ బ్రహ్మ భువనాల్లోకాః పునరావర్తినో౽ర్జున ।
మాముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే ॥ 8:16 ॥

**పదవిభాగము:** ఆబ్రహ్మభువనాత్, లోకాః, పునరావర్తినః, అర్జున, మాం, ఉపేత్య, తు, కౌంతేయ, పునర్జన్మ, న, విద్యతే

**ప్రతిపదార్థము:** **కౌంతేయా!** = కుంతీపుత్రా!, **ఆబ్రహ్మ భువనాత్** = భూలోకము నుండి బ్రహ్మలోకము వరకు గల, **లోకాః** = సమస్త లోకములు, **పునరావృత్తినః** = పునర్జన్మమును కలుగజేయునట్టివి, **మాం** = నన్ను, **ఉపేత్య తు** = పొందినట్లయితే, **పునర్జన్మ** = మళ్ళీ జన్మ, **న విద్యతే** = ఉండదు.

**తాత్పర్యము:** కౌంతేయా! భూలోకము నుండి బ్రహ్మలోక పర్యంతము సమస్త లోకములు తిరిగి వచ్చెడు స్వభావము కలిగినవి. అక్కడి ఊర్ధ్వలోకముల నుండి తిరిగి వచ్చినవారు మరలా ఈ లోకములో జన్మించవలసినదే!. (ఈ లోకములు అన్నియు కాలమునకు పరిమితమైనవి. పరమాత్మ కాలాతీతుడు) కాని నన్ను పొందిన వారికి మరుజన్మ లేనే లేదు.

**విశేషార్థము:** శ్రీమద్భాగవతంలో పుణ్యకర్మలు చేయువారు పొందే ఊర్ధ్వలోకాలు 'ఏడు' అని చెప్పబడినవి. **1.భూః** (మానవ లోకము), **2.భువః** (పితృదేవతలు ఉండే లోకము), **3.స్వః** (స్వర్గ లోకము), **4.మహః** (కల్పాయువు కలిగిన దేవతా ప్రముఖులు నమస్కారయోగముతో సమాధిలో ఉండే లోకము), **5.జనః** (సనకసనందాది మహర్షులు ఉండే లోకము), **6.తపః** (మహాతపస్సంపన్నుల లోకము), **7.సత్యః** (బ్రహ్మ లోకము) లోకాలు. ఇది ముక్తి క్రమము. మోక్షము పొందాలనే ఆకాంక్షతో సగుణ బ్రహ్మోపాసనతో జ్ఞానము పొందిన వారికి మోక్షము లభిస్తుంది. భోగేచ్ఛతో కర్మలను ఆచరించిన వారు ఆ లోకాల నుండి తిరిగి వచ్చి మరల జన్మిస్తున్నారు. బ్రహ్మలోకము కూడా అనిత్యం. పరమాత్మ సత్యం. పరమాత్మను పొందిన వారికి మరుజన్మ లేదు.




**శ్లోకం :** **అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥ 9:22 ॥**

**పదవిభాగము:** అనన్యాః, చింతయంతః, మాం, యే, జనాః, పర్యుపాసతే, తేషాం, నిత్యాభియుక్తానాం, యోగక్షేమం, వహామి, అహమ్

**ప్రతిపదార్థము:** **అనన్యా** = ఇతర చింతలు లేనివారై (ఆత్మ భావముతో), **మాం** = పరమేశ్వరుడనైన నన్ను, **చింతయంతః** = నిరంతరము చింతించుచు, **యే జనాః** = ఏ జనులు, **పర్యుపాసతే** = నిష్కామ భావముతో సేవింతురో, **నిత్యాభియుక్తానాం** = ఎల్లప్పుడు చిత్తమును నాయందే యుంచి ధ్యానము చేయునట్టి, **తేషాం** = వారి యొక్క, **యోగక్షేమం** = పొందలేనిది పొందటం యోగము, పొందిన దానిని సంరక్షించడము క్షేమము, **అహమ్** = నేనే (స్వయముగా), **వహామి** = వహిస్తున్నాను.

**తాత్పర్యము:** పరమేశ్వరుడనైన నన్ను నిరంతరము అనన్య భక్తితో చింతన చేయుచూ, నిష్కామ భావముతో సేవించువారి యోగక్షేమమములు నేనే వహించుచున్నాను.

**విశేషార్థము:** అంతరంగమున ఎట్టి కోరికలు లేకుండా జీవనకాల పర్యంతముకాని, మరణకాలము నందుకాని అనన్య భక్తులు (పూర్ణ జ్ఞానులు) తమ కొరకు ఏమీ కోరుకొనరు. కనుక వారి యోగక్షేమములు నేను వహింతునని భగవానుడు అభయ ప్రదానము చేయుచున్నాడు. పరమాత్మ ప్రాప్తి నొందిన జ్ఞాని, భగవంతుని కంటే అన్యమేదీ లేదనే భావనచే తన యోగక్షేమముల గురించి స్వప్రయత్నం ఏదీ చేయడు. కనుక భగవంతుడే అతని మంచి చెడులకు బాధ్యత వహిస్తాడు.




**శ్లోకం : పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।**
**తదహం భక్త్యుపహృతమ్ అశ్నామి ప్రయతాత్మనః ॥ 9:26 ॥**

**పదవిభాగము:** పత్రం, పుష్పం, ఫలం, తోయం, యః, మే, భక్త్యా, ప్రయచ్ఛతి, తత్, అహం, భక్త్యుపహృతమ్, అశ్నామి, ప్రయతాత్మనః

**ప్రతిపదార్థము:** **యః** = ఏ పురుషుడు, **మే** = నాకు, **భక్త్యా** = భక్తితో, **పత్రం** = పత్రమును గాని, **పుష్పం** = పుష్పమునుగాని, **ఫలం** = ఫలమునుగాని, **తోయం** = జలమును (నీరు) గాని, **ప్రయచ్ఛతి** = సమర్పించుచున్నాడో, **ప్రయత ఆత్మనః** = పరిశుద్ధాంతఃకరణుడైన నిష్కామ భక్తునిచే, **భక్త్యుపహృతమ్** = భక్తితో సమర్పింపబడిన, **తత్** = ఆ పత్ర, పుష్పాదులను, **అహం** = నేను, **అశ్నామి** = స్వయముగా ప్రీతితో స్వీకరింతును.

**తాత్పర్యము:** పరిశుద్ధమైన మనస్సుతో నాకు భక్తి పూర్వకముగా పరమ భక్తునిచే సమర్పింపబడిన ఆకునుగాని, పువ్వునుగాని, పండుగాని, నీరుగాని నేను అత్యంత ప్రీతితో స్వీకరింతును.

**విశేషార్థము:** పరమ భాగవతోత్తములైన భక్తులు సమర్పించిన పత్ర, ఫల పుష్పాదులు ఎంత విలువ కలవని భగవంతుడు చూడడు. వారిలోని నిర్మల, నిష్కామ భగవత్ భక్తినే ప్రాతిపదికగా చేసుకొని భగవంతుడు అనుగ్రహిస్తాడు. **'భగవంతుని పొందుటకు నిష్కామ కర్మలే ప్రాతిపదిక'** తప్ప భగవంతునికి విలువైన కానుకలు సమర్పించి దైవానుగ్రహము పొందలేమని భావము.




**శ్లోకం :** **అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయ స్థితః ।**
**అహమాదిశ్చ మధ్యం చ భూతానామంత ఏవ చ ॥ 10:20 ॥**

**పదవిభాగము:** అహం, ఆత్మా, గుడాకేశ, సర్వభూతాశయస్థితః, అహం, ఆదిః, చ, మధ్యం, చ, భూతానాం, అంతః, ఏవ, చ

**ప్రతిపదార్థము:** **ఓ గుడాకేశ!** = ఓ అర్జునా!, ('గుడాక' అనగా నిద్ర. గుడాక+ఈశుడు = గుడాకేశుడు. నిద్రను జయించినవాడు), **అహం** = నేను, **సర్వభూతాశయ స్థితః** = సమస్త ప్రాణుల హృదయములయందు అంతర్యామిగా, **ఆత్మా** = జీవాత్మను (జీవచైతన్యాన్ని), **ఆదిః** = సృష్టియు (ఉత్పత్తిని), **మధ్యం** = మధ్యమును, (స్థితిని) **అంతః చ** = అంతయు (ప్రళయాన్ని) కూడా, **అహం ఏవ** = నేనే కారణమగుచున్నాను.

**తాత్పర్యము:** ఓ గుడాకేశా ! (నిద్రను జయించిన అర్జునా!) సమస్త ప్రాణులయందున్న జీవాత్మను నేనే, సకలప్రాణుల ఉత్పత్తి, పెంపు, సంహారము (సృష్టి, స్థితి, లయలు) అంతటికి నేనే కారణముగా యున్నాను.

**విశేషార్థము:** **'సర్వభూతాశయస్థితః'** సకల ప్రాణుల యందు అంతర్యామిగా పరమేశ్వర తత్త్వము వ్యాపించి జీవాత్మగా, జీవుల పుట్టుక, పెంపు, నాశనమునకు కారణమైయున్నదని తెలుసుకొనవలెను. జీవాత్మయే పరమాత్మయను **'అఖండ అద్వైత జ్ఞానబోధ'** భగవానుడు చేయుచున్నాడు. జ్ఞాని అన్ని ప్రాణులను పరమేశ్వరుని అంశగా భావించి వివక్షత చూపకుండ ప్రవర్తింపవలెనని ఈ శ్లోక భావము.




**శ్లోకం : యద్యద్విభూతిమత్ సత్త్వం శ్రీమదూర్జితమేవ వా ।**
**తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశసంభవమ్ ॥ 10:41॥**

**పదవిభాగము:** యత్, యత్, విభూతిమత్, సత్త్వం, శ్రీమత్, ఊర్జితం, ఏవ, వా, తత్, తత్, ఏవ, అవగచ్ఛ, త్వం, మమ, తేజోఽంశసంభవమ్

**ప్రతిపదార్థము:** **విభూతిమత్** = ఐశ్వర్యయుక్తము, **శ్రీమత్** = కాంతియుతము, **ఊర్జితం ఏవవా** = దృఢమైన ఉత్సాహముతో కూడినది (బలయుతము అయిన), **యత్ యత్** = ఏ ఏ, **సత్త్వం** = వస్తువు (ప్రాణికలదో), **తత్ తత్** = ఆయా వస్తుజాతమంతా, **మమః** = నా యొక్క, **తేజోఽంశ సంభవమ్** = తేజస్సు వలన కలిగినదిగా, **త్వం** = నీవు, **అవగచ్ఛ** = గ్రహించు.

**తాత్పర్యము:** అర్జునా! లోకములో ఐశ్వర్యయుక్తము, కాంతియుక్తము, శక్తియుక్తము అయిన వస్తువు ఏది ఉన్ననూ, అది పరమేశ్వరుడనైన నా తేజస్సు యొక్క అంశము నుండి కలిగినదిగా తెలుసుకొనుము.

**విశేషార్థము:** లోకంలో ఐశ్వర్యయుక్తమైన, కాంతియుక్తమైన, శక్తియుక్తమైన వస్తువులు అన్నియూ ఈశ్వరాంశ వల్లనే ఆత్మ చైతన్యము పొంది ప్రకాశించుచున్నవని గ్రహించవలెను. చరాచర జగత్తు అంతయూ కేవలము భగవంతునిలో ఒక్క అంశతో వివిధ రూపాలలో ఏర్పడినవని తెలుసుకొనుట ద్వారా 'నేను-నాది' అనే మమకారము, దేహాభిమానము నశించి మనస్సులో **'సర్వాత్మ భావము'** వృద్ధి చెందును.




**శ్లోకం : భక్త్యా త్వనన్యయా శక్య అహమేవంవిధోఽర్జున ।**
**జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప ॥ 11:54 ॥**

**పదవిభాగము :** భక్త్యా, తు, అనన్యయా, శక్యః, అహం, ఏవం విధః, అర్జున, జ్ఞాతుం, ద్రష్టుం, చ, తత్త్వేన, ప్రవేష్టుం, చ, పరంతప

**ప్రతిపదార్థము: పరంతపా!** = ఓ శత్రువులను తపింపచేసే వీరుడా!, **అర్జున** = అర్జునా!, **తు** = కేవలం, **అనన్యయా** = పరమాత్మ తప్ప ఇతరములు అభిలషించని, **భక్త్యా** = భక్తిచేత, **ఏవం విధః** = ఇట్టి చతుర్భుజ రూపుడను, **తత్త్వేన** = యథార్థముగా, **జ్ఞాతుం** = తత్త్వజ్ఞానము ద్వారా ఎరుంగుటకు, **ద్రష్టుం చ** = సాక్షాత్కరించుకొనుటకు, **ప్రవేష్టుం చ** = ప్రవేశించుటకు (ఐక్యము నొందుటకు), **అహం** = నేను, **శక్యః** = సాధ్యుడనగుదును.

**తాత్పర్యము:** శత్రువులను తపింపజేయు వీరుడవైన అర్జునా !, నీవు చూచిన నా విశ్వరూపము చతుర్భుజ రూపమును ప్రత్యక్షముగా చూచుటకు, తత్త్వజ్ఞానము పొందుటకు, అందు ఏకీభావ స్థితిని పొందుటకు కేవలము అనన్య భక్తి ద్వారా మాత్రమే సాధ్యమగును.

**విశేషార్థము:** వేదాధ్యయనము, తీవ్ర తపస్సులు, యజ్ఞదానాది పలు విధములైన క్రియలు చేసిన వారైనప్పటికి పరమాత్మ యందు భక్తి లేనివారైతే భగవంతుని దర్శించలేరు. పరమాత్మ తప్ప ఇతరములు ఎరుగని అనన్యభక్తి ద్వారా మాత్రమే తత్త్వజ్ఞానము పొందుటకు, పరమాత్మను దర్శించుటకు, పరమాత్మలో ఐక్యము నొందుటకు సాధ్యమగును. ఇది **'సంపూర్ణ అద్వైతము.'**




**శ్లోకం : మత్కర్మకృత్ మత్పరమో మద్భక్తస్సంగవర్జితః ।**
**నిర్వైరస్సర్వ భూతేషు యస్స మామేతి పాండవ ॥ 11:55 ॥**

**పదవిభాగము:** మత్కర్మకృత్, మత్పరమః, మద్భక్తః, సంగవర్జితః, నిర్వైరః, సర్వభూతేషు, యః, సః, మాం, ఏతి, పాండవ

**ప్రతిపదార్థము:** **పాండవ!** = పాండుకుమారా!, **యః** = ఎవడైతే, **మత్కర్మకృత్** = నా కొరకై కర్తవ్య కర్మలను ఆచరిస్తాడో, **మత్పరమః** = నేనే పరమగతిగా భావించుచున్నాడో, **సంగవర్జితః** = ప్రాపంచిక విషయములయందు ఆసక్తి రహితుడైనవాడు, **నిర్వైరః** = ప్రాణులందు శత్రుభావము లేనివాడు, **సః మద్భక్తః** = అట్టి అనన్యభక్తుడు, **మాం** = నన్ను, **ఏతి** = పొందుచున్నాడు.

**తాత్పర్యము:** పాండునందనా! లౌకిక, వేదవిహిత మరియు కర్తవ్యకర్మలు అన్నింటినీ నాకే అర్పించువాడు, నేనే పరమగతి అని నాయందు భక్తి శ్రద్ధలు కలిగియుండువాడు, ప్రాపంచిక విషయములయందు ఆసక్తి లేనివాడు, సమస్త ప్రాణుల యందు శత్రుభావము లేనట్టి నా అనన్య భక్తుడు నన్నే పొందుచున్నాడు. సంపూర్ణ ముక్తస్థితిని పొందుచున్నాడని భావము.

**విశేషార్థము:** సంపూర్ణ తత్త్వజ్ఞానము పొందుటకు భగవానునిచే **'సాధనాపంచకము'** చెప్పబడినది. **1.మత్కర్మకృత్** లౌకిక, వేదవిహిత, కర్తవ్యకర్మలు స్వార్థరహితముగా నాకే అర్పణ చేయుట. **2.మత్పరమః** భగవత్ ప్రాప్తియే పరమలక్ష్యము, పురుషార్థముగా భావించుట. **3.మద్భక్తః** సర్వాత్మ స్వరూపుడనగు నన్ను సర్వత్రా సర్వదా భజించుట. **4.సంగవర్జితః** బాహ్య వస్తువులయందు ఆసక్తి లేకపోవుట. **5.నిర్వైరః సర్వభూతేషు** సర్వ ప్రాణులయందు వైర భావము లేకుండా ప్రేమ, కరుణ కలిగియుండుట. –ఇట్టి సద్గుణములు కలవాడు నన్ను పొందుచున్నాడు.




**శ్లోకం : అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ ।**
**నిర్మమో నిరహంకారః సమ దుఃఖసుఖః క్షమీ ॥ 12:13 ॥**

**పదవిభాగము :** అద్వేష్టా, సర్వభూతానామ్, మైత్రః, కరుణః, ఏవ, చ, నిర్మమః, నిరహంకారః, సమదుఃఖసుఖః, క్షమీ

**ప్రతిపదార్థము:** **సర్వభూతానాం** = సకల ప్రాణులయందును, **అద్వేష్టా** = ద్వేషభావము లేనివాడు, **మైత్రః** = మిత్రభావం కలవాడు, **కరుణ ఏవ చ** = దయ కలవాడు, **నిర్మమః** = మమకారము లేనివాడు, **నిరహంకారః** = అహంకారము లేనివాడు, **సమదుఃఖ సుఖః** = సుఖదుఃఖముల పట్ల సమాన బుద్ధి కలవాడు, **క్షమీ** = ఓర్పు కలవాడు.

**తాత్పర్యము:** ఏ ప్రాణిని ద్వేషింపనివాడు. సర్వ ప్రాణులయందు మిత్రధర్మము కలవాడు. దయాళువు. దేనియందు మమకారము లేనివాడు. అహంకారము లేనివాడు, దుఃఖము వచ్చినను సుఖము వచ్చినను ద్వేషమును కాని రాగమును గాని పొందక సమానుడై ఉండువాడు. నిందించినా, స్తుతించినా వికారము పొందక ఓర్పు వహించువాడు నాకు ప్రియుడు.

**విశేషార్థము:** పై శ్లోకంలో భగవానునిచే చెప్పబడిన 'అద్వేష్టా సర్వభూతానాం' మొదలైన లక్షణములు అన్ని శాంత లక్షణములైన బ్రహ్మ భావములు. ఈ లక్షణములను కలిగియున్న జ్ఞానవంతులు నాకు ప్రియమైన భక్తులని భగవానుడు చెప్పుచున్నాడు. (భక్తియోగములో చెప్పబడిన అమృతత్త్వగుణములు గల భక్తాగ్రేసరునిగా శ్రీనాథకవిసార్వభౌముని ఉదాహరణగా చూపబడినది.)



**శ్లోకం : సంతుష్టస్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః ।**
**మయ్యర్పిత మనోబుద్ధిః యో మద్భక్త స్స మే ప్రియః ॥ 12:14 ॥**

**పదవిభాగము :** సంతుష్టః, సతతం, యోగీ, యతాత్మా, దృఢనిశ్చయః, మయి, అర్పితమనోబుద్ధిః, యః, మద్భక్తః, సః, మే, ప్రియః

**ప్రతిపదార్థము: సతతం** = ఎల్లప్పుడూ, **సంతుష్టః** = సంతోషం కలవాడు, **యోగీ** = సమాహిత చిత్తుడు (సర్వదా ఆనందస్వరూపమగు బ్రహ్మము నందే నిశ్చల చిత్తము కలవాడు), **యతాత్మా** = శరీర ఇంద్రియములను వశము చేసుకొని ఆత్మ భావము పొందినవాడు, **దృఢనిశ్చయః** = దృఢ సంకల్పం కలవాడు, **మయి అర్పిత మనఃబుద్ధిః** = నాయందు మనస్సును బుద్ధిని అర్పణ చేసినవాడు, **మద్భక్తః** = నా భక్తుడు, **యః** = ఎవడో, **సః** = అతడు, **మే** = నాకు, **ప్రియః** = ఇష్టమైనవాడు.

**తాత్పర్యము:** సర్వకాల సర్వావస్థలయందు ప్రసన్నచిత్తుడు, శరీరేంద్రియ మనో నిగ్రహం గలవాడు. దృఢమైన నిశ్చయ జ్ఞానము కలవాడు (స్థితప్రజ్ఞుడని భావము). భగవంతునికి అర్పించిన మనస్సు బుద్ధి కలవాడు. నా భక్తుడైనవాడు నాకు ప్రియుడగుచున్నాడు.

**విశేషార్థము: 'అద్వేష్టా సర్వభూతానాం'** అనే శ్లోకంలోని ఏడు గుణాలు, ఈ శ్లోకంలో చెప్పబడిన ఐదు గుణములే కాక భక్తియోగములో భగవానుడు నిరాకారమైన భగవంతుని స్వరూపాన్ని 35 గుణాలుగా బోధించాడు. ఇట్టి గుణములు కల యోగులు **'అమృతతత్త్వసిద్ధి'**ని పొందుటయేకాక నాకు అత్యంత ప్రియమైనవారు అని భగవానుడు చెప్పుచున్నాడు.




**శ్లోకం : సర్వతః పాణిపాదం తత్ సర్వతోఽక్షి శిరోముఖమ్ ।**
**సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి ॥ 13:13 ॥**

**పదవిభాగము :** సర్వతః, పాణిపాదం, తత్, సర్వతః, అక్షిశిరోముఖమ్, సర్వతః, శ్రుతిమత్, లోకే, సర్వం, ఆవృత్య, తిష్ఠతి

**ప్రతిపదార్థము:** **తత్** = ఆ పరమాత్మ, **సర్వతః పాణిపాదం** = అంతట చేతులును, పాదములను కల్గియున్నవాడు, **సర్వతోఽక్షి శిరోముఖమ్** = అంతట నేత్రములు, శిరస్సులు, ముఖములు గలవాడు, **శ్రుతిమత్** = చెవులు గలవాడు, **యతః** = ఎందువలననగా (అతడు), **లోకే** = లోకమునందు, **సర్వం ఆవృత్య** = అంతటను వ్యాపించి, **తిష్ఠతి** = వెలుగొందుచున్నాడు.

**తాత్పర్యము:** తెలియదగిన ఈ బ్రహ్మము అంతటను చేతులు, పాదములు, కన్నులు, శిరస్సులు, ముఖములు, చెవులుగలదియై సకలప్రాణి సముదాయమునందు, అచేతన వర్గము నందు విశ్వవ్యాప్తమైయున్నది.

**విశేషార్థము:** వేదాలలో వర్ణింపబడిన నిర్విశేషమైన బ్రహ్మము (బ్రహ్మమునకు ఎట్టి అవయవములు లేవు.) అయినప్పటికీ సంపూర్ణ జగత్తుకు కారణమైన సర్వవ్యాపకత్వాన్ని చరాచర జీవరాశిలో స్థితుడైనట్టి ఈశ్వరతత్వమును వర్ణించుటకు ఈ విధముగా చేతులు, పాదములు, కన్నులు, శిరస్సులు ఉన్నట్లు భగవానునిచే చెప్పబడినది. ప్రతి అణువణువులోనూ పరమాత్మ స్థితుడై సర్వసాక్షియై యున్నాడనే జ్ఞానము కలుగజేయుటయే ఈ శ్లోక భావము.




**శ్లోకం : సమం పశ్యన్ హి సర్వత్ర సమవస్థిత మీశ్వరమ్ ।**
**న హినస్త్యాత్మ నాత్మానం తతో యాతి పరాం గతిమ్ ॥ 13:28 ॥**

**పదవిభాగము :** సమం, పశ్యన్, హి, సర్వత్ర, సమవస్థితం, ఈశ్వరమ్, న, హినస్తి, ఆత్మనా, ఆత్మానాం, తతః, యాతి, పరాం, గతిమ్

**ప్రతిపదార్థము:** **హి** = ఏలననగా, **సర్వత్ర** = (అతడు) అన్నింటియందును, **సమవస్థితం** = సమభావముతో స్థితుడైన, **ఈశ్వరమ్** = పరమేశ్వరుని, **సమం పశ్యన్** = సమానముగా చూచుచూ, **ఆత్మనా** = తనద్వారా, **ఆత్మానం** = తనను, **న హినస్తి** = నాశన మొనరించుకొనడు, **తతః** = అందువలన (అతడు), **పరాం గతిమ్** = పరమగతిని, **యాతి** = పొందును.

**తాత్పర్యము:** సకల ప్రాణుల యందు సమముగా ఉన్న పరమేశ్వరుని సర్వసమునిగా తెలుసుకొనిన మనుజుడు తన ఆత్మను తాను హింసించుకొనడు. అనగా తనను తాను నాశనము చేసుకొనువాడు కాడు. అందువలన అతడు పరమగతిని పొందును.

**విశేషార్థము:** సకల ప్రాణుల యందు పరమాత్మ సమముగా ఉన్నట్లు వీక్షించు జ్ఞానముకల మనుజుడు తనను తాను ఉద్ధరించుకున్నవాడు అగుచున్నాడు. పరమాత్మ సర్వజీవులలో ఏకాత్మ స్వరూపముగా వ్యాపించి ఉన్నాడనే జ్ఞానములేని మనుజుడు తనను తాను చంపుకున్నవాడు అగుచున్నాడు. 'ఆత్మహంతకుడు' అగుచున్నాడు. అనగా ఈ జన్మలో ఆత్మ సాక్షాత్కారము పొందలేక పోవుచున్నాడు. సకల ప్రాణులలో దైవమును సాక్షాత్కరించు కున్నవాడు ఈ జన్మలోనే మోక్షమును పొందుచున్నాడు అని శ్లోక భావము.




**శ్లోకం : మానావమానయోస్తుల్యః తుల్యో మిత్రారి పక్షయోః ।**
**సర్వారంభ పరిత్యాగీ గుణాతీతః స ఉచ్యతే ॥ 14:25 ॥**

**పదవిభాగము:** మానావమానయోః, తుల్యః, తుల్యః, మిత్రారిపక్షయోః, సర్వారంభ పరిత్యాగీ, గుణాతీతః, సః, ఉచ్యతే

**ప్రతిపదార్థము:** **మాన అవమానయోః** = సత్కారమునందును, తిరస్కారమునందును, **తుల్యః** = సముడు, **మిత్ర అరి పక్షయో** = మిత్రుల యందు, శత్రువుల యందు, **తుల్యః** = సముడు, **సర్వ ఆరంభ పరిత్యాగీ** = పుణ్యపాపములను ఒసగే సమస్త కర్మలను త్యజించిన వాడు, **సః** = అట్టి పురుషుడు, **గుణ అతీతః** = గుణములకు అతీతుడని, **ఉచ్యతే** = చెప్పబడుచున్నాడు.

**తాత్పర్యము:** మానావమానములందు (పూజించినా, పరాభవించినా) మిత్రుల యందు, శత్రువుల యందు సమభావము కలవాడు, దేహ నిర్వహణకు ఆవశ్యకమగు కర్మలు తప్ప తన ప్రయోజనము కొరకు ఎట్టి కర్మను చేయనివాడు త్రిగుణాలను (సత్త్వ, రజ, తమో గుణాలను) అధిగమించి బ్రహ్మభావము పొందుతాడు.

**విశేషార్థము:** పరమాత్మస్థితి యందున్న త్రిగుణాతీతుడు స్వభావసిద్ధముగా దేనిని పట్టించుకొనడు. అతనికి ఎట్టి భావవికారములు లేవు. మానావమానములు, ప్రియాప్రియములు, శత్రుమిత్రులను భేదభావము, నిందాస్తుతులు, లోకాడంబరముల యందు రాగము మొదలగు భావవికారములు అన్నియు లోకదృష్టిని (లోకంలో జనులు భావించే సాధారణ దృష్టికి, గుణాతీతుని యొక్క నిజాత్మ స్థితికి ఉన్న భేదము) అనుసరించి చెప్పబడినదిగా సాధకులు గ్రహించాలి.




**శ్లోకం : శరీరం యదవాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః ।**
**గృహీత్వైతాని సంయాతి వాయుర్గంధానివాశయాత్ । 15:8 ॥**

**పదవిభాగము:** శరీరమ్, యత్, అవాప్నోతి, యత్, చ, అపి, ఉత్క్రామతి, ఈశ్వరః, గృహీత్వా, ఏతాని, సంయాతి, వాయుః, గంధాన్, ఇవ, ఆశయాత్

**ప్రతిపదార్థము:** **వాయుః** = వాయువు, **ఆశయాత్** = గంధస్థానము నుండి, **గంధాన్** = (గంధములను) వాసనలను, **ఇవ** = గ్రహించి తీసికొని పోయినట్లుగా, **ఈశ్వరః అపి** = ప్రాణుల దేహములయందున్న జీవాత్మ, **యత్** = ఏ శరీరమును, **ఉత్క్రామతి** = త్యజించునో, **ఏతాని** = ఈ మనో ఇంద్రియములను, **గృహీత్వా** = గ్రహించి, **చ** = మరియు, **యత్ శరీరము** = ఏ శరీరమును, **అవాప్నోతి** = పొందునో (దానినే), **సంయాతి** = చేరును.

**తాత్పర్యము:** వాయువు పుష్పాదుల యందు గంధము (వాసనను) బయటకు వెడలునప్పుడు పుష్పమును అక్కడే విడిచి అందలి పరిమళము గల పరమాణువులను ఎట్లు తీసుకొని పోవుచున్నదో, అట్లే స్వామియైన జీవాత్మ కొంతకాలము ఒక దేహము నందు ఉండి కర్మ వశమున ఆ దేహమును వదిలి మరొక దేహమును పొందునప్పుడు శరీరమును అచ్చటే విడిచి మనస్సు మొదలైన ఆరు ఇంద్రియములను తీసుకొని మరొక నూతన శరీరములో ప్రవేశించును.

**విశేషార్థము:** మరణానంతరము మానవుడు ఏమవుతున్నాడు? అనే ప్రశ్నకు ప్రపంచ వాఙ్మయంలో ఎక్కడా ఎవ్వరూ సమాధానము చెప్పలేదు. సనాతన భారతీయ విజ్ఞానమే ఈ ప్రశ్నకు సమాధానము చెప్పినది. భగవానునిచే చెప్పబడిన ఈ శ్లోకమే ఆ ప్రశ్నకు సమాధానము. జీవుడు ఈ శరీరమును వీడి నూతన శరీరము ధరించునప్పుడు మనస్సు మొదలైన ఆరు ఇంద్రియములను తీసుకొని వెళ్లుచున్నాడు అనే సత్యమును సాధకులు తెలుసుకొని, తాను దేహము కాదు, దేహము కంటే అన్యుడగు ఆత్మస్వరూపుడనని ఎరింగి దేహాభిమానము వీడవలెను.




**శ్లోకం :** **అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః ।**
**ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥ 15:14 ॥**

**పదవిభాగము :** అహం, వైశ్వానరః, భూత్వా, ప్రాణినాం, దేహం, ఆశ్రితః, ప్రాణాపాన సమాయుక్తః, పచామి, అన్నం, చతుర్విధమ్

**ప్రతిపదార్థము:** **అహం** = సర్వాత్ముడైన నేనే, **వైశ్వానరః భూత్వా** = జఠరాగ్నినై, **ప్రాణినాం** = జీవుల, **దేహం** = శరీరమును, **ఆశ్రితః** = ఆశ్రయించి, **ప్రాణ అపాన సమాయుక్తః** = ప్రాణాపాన వాయవులతో కూడి, **చతుర్విధం** = నాలుగు విధాలైన, **అన్నం** = ఆహార పదార్థములను, **పచామి** = జీర్ణము చేయుచున్నాను.

**తాత్పర్యము:** వైశ్వానరుడనైన నేను సకలప్రాణుల శరీరాలలో జఠరాగ్నిగా ఉంటూ, ప్రాణాపాన వాయువులతో ఉఛ్ఛ్వాస, నిశ్వాసలతో కూడిన వాడినై సకల ప్రాణులు భుజించు భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్యమను పేర్లు గల నాలుగు విధములైన ఆహారములను జీర్ణము చేయుచున్నాను.

**విశేషార్థము:** భగవంతుడు అగ్ని రూపములో ప్రతీ జీవి ఉదరములో జఠరాగ్నిగా యుండి ఆకలి పుట్టిస్తూ, ప్రాణముతో ఆహారాన్ని స్వీకరిస్తూ, జఠరాగ్నిగా జీర్ణము చేస్తూ, జీర్ణమైన ఆహారాన్ని వంటబట్టించి వ్యర్థాలను అపానంలో మల మూత్రములుగా విసర్జిస్తూ, సమస్త ప్రాణులు భుజించు **భక్ష్యములు** (దంతములతో కొరికి తినెడు ఘన పదార్థములు రొట్టెలు, అన్నము, కూరలు మొదలైనవి) **భోజ్యములు** (నాలుకచే గ్రహింపబడి త్రాగునట్టి ద్రవ పదార్థములు, పాలు, నీరు, పళ్ళరసాలు మొదలైనవి) **చోష్యములు** (పళ్ళతో నమిలి రసమును పీల్చి పిప్పిని విసర్జించు చెరుకు, ద్రాక్ష మొదలైనవి. **లేహ్యములు** (నాలుకపై వేసుకొని చప్పరించి తిను పదార్థములు (తేనె, బెల్లం మొదలైనవి) అను నాలుగు రకములైన పదార్థములను జీర్ణము చేయుచున్నాడు.




**శ్లోకం : త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః ।**
**కామః క్రోధస్తథా లోభః తస్మాదేతత్త్రయం త్యజేత్ । 16:21 ॥**

**పదవిభాగము:** త్రివిధం, నరకస్య, ఇదం, ద్వారం, నాశనం, ఆత్మనః, కామః, క్రోధః, తథా, లోభః, తస్మాత్, ఏతత్, త్రయం, త్యజేత్

**ప్రతిపదార్థము:** **కామః** = కామము, **క్రోధః** = క్రోధము, **తథా** = అట్లే, **లోభః** = లోభము, **ఇదం** = ఈ అసుర భావము, **త్రివిధం** = మూడు విధములు, **నరకస్య** = నరకమునకు, **ద్వారం** = ద్వారములు (మార్గములు), **ఆత్మనః** = జీవుని, **నాశనం** = నశింపజేయునవి, **తస్మాత్** = అందువలన, **ఏతత్ త్రయం** = ఈ మూడింటిని, **త్యజేత్** = విడిచిపెట్టవలెను.

**తాత్పర్యము: కామము, క్రోధము, లోభము** అనునవి నరకానికి మూడు ద్వారములు. వీటి మూలముగా మానవుడు తనను తాను నశింపజేసుకుంటున్నాడు. కనుక మానవులు ఈ మూడింటిని త్యజించవలెను.

**విశేషార్థము:** సమస్త అసురీ లక్షణములకు మూలమైనవి **కామము** (కోరికలు కలిగియుండుట), **క్రోధము** (కోపము కలిగియుండుట), **లోభము** (దురాశ కలిగియుండుట) అను మూడు గుణములే ఆత్మకు వినాశనము కలిగించుచున్నవి. ఈ మూడింటిని విడిచి పెట్టినట్లయితే సమస్త అసురీ లక్షణములు నశించినట్లే. మానవులు ఆత్మోద్ధరణమునకై భగవదాజ్ఞానుసారము వీటిని విడిచి పెట్టి దైవీగుణములను అలవరుచుకొనుటకు ప్రయత్నించుట ద్వారా ఉత్తమగతులను పొందవచ్చును.




**శ్లోకం :** **తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ ।**
**జ్ఞాత్వా శాస్త్ర విధానోక్తం కర్మ కర్తుమిహార్హసి ॥ 16:24 ॥**

**పదవిభాగము:** తస్మాత్, శాస్త్రం, ప్రమాణం, తే, కార్యాకార్యవ్యవస్థితౌ, జ్ఞాత్వా, శాస్త్రవిధానోక్తం, కర్మ, కర్తుం, ఇహ, అర్హసి

**ప్రతిపదార్థము:** **తస్మాత్** = అందువలన, **కార్య అకార్య** = కర్తవ్య-అకర్తవ్య, **వ్యవస్థితౌ** = నిర్ణయ విషయములో, **శాస్త్రం** = శాస్త్రము, **తే** = నీకు, **ప్రమాణం** = జ్ఞాన సాధనము/బోధకము, **ఇహ** = ఈ లోకంలో, **శాస్త్రవిధాన ఉక్తం** = శాస్త్రమునందు చెప్పబడిన దానిని, **జ్ఞాత్వా** = గ్రహించి, **కర్మ** = కర్మను, **కర్తుం** = చేయుటకు, **అర్హసి** = యోగ్యుడవు అవుతావు.

**తాత్పర్యము:** ఏది కర్తవ్యమో **(చేయదగినది)** ఏది అకర్తవ్యమో **(చేయకూడనిది)** నిర్ణయించుటకు శాస్త్రమే ప్రామాణికము. కనుక శాస్త్రములలో చెప్పబడిన కర్మలను గూర్చి బాగుగా తెలుసుకొని శాస్త్ర విహిత కర్మలను ఆచరింపుము.

**విశేషార్థము:** **ధర్మమును-అధర్మమును** నిశ్చయముగా ఎరుగుటకు శాస్త్రమే ప్రామాణికము. (శాస్త్రము అనగా వేదాలు, స్మృతులు, పురాణాలు, రామాయణ, భారతాది ఇతిహాసాలు) ఇట్టి శాస్త్రముల ద్వారా **'ఈ పని చేయకుము'** **'ఈ పని చేయుము'** అని చెప్పబడినవే ఆదేశములు. శాస్త్రములయందు చెప్పబడిన విధి, నిషేధాల స్వరూపాన్ని గ్రహించి స్వకర్మను తెలుసుకొని కర్మాధికారివై కర్మక్షేత్రము నందు కర్మలను ఆచరించుము. చిత్తశుద్ధికి, జ్ఞానానికి, మోక్షానికి కర్మయే మూలము కనుక శాస్త్రోక్త కర్మలను ఆచరించాలి. నిషిద్ధ కర్మలను త్యజించాలి.




**శ్లోకం : అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్ ।**
**స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయమ్ తప ఉచ్యతే । 17:15 ॥**

**పదవిభాగము:** అనుద్వేగకరం, వాక్యం, సత్యం, ప్రియహితం, చ యత్, స్వాధ్యాయాభ్యసనం, చ, ఏవ, వాఙ్మయం, తపః, ఉచ్యతే

**ప్రతిపదార్థము:** **యత్** = ఏదయితే, **వాక్యం** = వచనము, **అనుద్వేగకరమ్** = ప్రాణులకు దుఃఖాన్ని కలిగించదో, **సత్యం** = యథార్థము, **ప్రియహితం చ** = ప్రియకరమూ, హితకరమూ, **చ** = మరియు, **స్వాధ్యాయాభ్యసనమ్** = వేదశాస్త్ర పఠనము, శాస్త్రములను అధ్యయనము చేయుట, ప్రణవాది మంత్రములను జపించుట, **వాఙ్మయం** = వాచకమైన, **తపః** = తపస్సు అని, **ఉచ్యతే** = చెప్పబడును.

**తాత్పర్యము:** ఇతరులకు బాధ కలుగకుండా హితము చేకూరునట్లు ప్రియముగా సత్యాన్ని (యథార్థాన్ని) మాట్లాడటం, అట్లే వేదశాస్త్ర పఠనము, ప్రణవాది (ఓంకారం) మంత్రములను జపించుట **'వాచక తపస్సు'** అని వేదములచే చెప్పబడినది.

**విశేషార్థము:** ఇతరులను ఉద్దేశించి మాట్లాడిన వాక్యములో ఉద్వేగము కలిగింపనిది, సత్యము, ప్రియము, హితము అనే నాలుగు లక్షణములు ఉంటే దానిని **'వాఙ్మయ తపస్సు'** అందురు. వీటిలో ఏ ఒక్క లక్షణము లోపించినా అది 'వాఙ్మయ తపస్సు' కానేరదు. శ్రీమద్రామాయణము సుందరకాండలో సీతాన్వేషణకై లంకకు వెళ్ళివచ్చి సీతాదేవి కుశలవార్త శ్రీరామచంద్రునికి నివేదించే సన్నివేశములో నవవ్యాకరణ పండితుడైన హనుమ పలికిన పలుకులు **"దృష్టా దేవీతి" "కనుగొంటి సీతమ్మను"** అని ఉద్వేగమునకు తావివ్వని విధముగా సత్యము, ప్రియము, హితము కూర్చే నాలుగు లక్షణములున్న రెండు పదములను హనుమ పలుకగా ఆ పలుకులు అమృతపు జల్లులై రామలక్ష్మణులను పరమానందభరితులను గావించినవి.




**శ్లోకం : యజ్ఞ దాన తపః కర్మ న త్యాజ్యం కార్యమేవ తత్ ।**
**యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్ ॥ 18:5 ॥**

**పదవిభాగము:** యజ్ఞదానతపఃకర్మ, న, త్యాజ్యం, కార్యం, ఏవ, తత్, యజ్ఞః, దానం, తపః, చ, ఏవ, పావనాని, మనీషిణామ్

**ప్రతిపదార్థము:** **యజ్ఞదానతపఃకర్మ** = యజ్ఞ, దాన, తపస్సులను ఆచరించుట, **న త్యాజ్యం** = త్యజింపరానివి, **తత్** = ఆ మూడును, **కార్యం ఏవ** = అవశ్యము ఆచరింపవలసినవే-ఏలననగా, **యజ్ఞః** = యజ్ఞము, **దానం** = దానము, **చ** = మరియు, **తపః** = తపస్సు, **ఏవ** = అను మూడు కర్మలే, **మనీషిణామ్** = ఫలాసక్తిని త్యజించిన బుద్ధిమంతులను, **పావనాని** = పవిత్ర మొనరించునవి.

**తాత్పర్యము:** అర్జునా! యజ్ఞదానతపో రూపమైన కర్మలను ఎన్నడూ విడిచిపెట్టరాదు. వీటిని ఆచరించవలసినదే. ఎందువలన అనగా యజ్ఞదానాది కర్మలు ఫలాసక్తి వీడిన వానికి చిత్తశుద్ధి కలిగించి పవిత్రునిగా చేయు సాధనములు.

**విశేషార్థము:** యజ్ఞములు అనగా కేవలము అగ్నికార్యములు అని భావింపరాదు. నాలుగవ అధ్యాయములో చెప్పబడిన పన్నెండు యజ్ఞములను మరియు శక్తిఅనుసారము దానములను ఆచరించుట వలన త్యాగబుద్ధి అలవడుతుంది. తపస్సు అనగా లక్ష్యసాధనపై మనస్సును ఏకాగ్రము చేయటము. తపస్సును ఆచరించుట వలన సాధకులు జ్ఞానవంతులు, శాస్త్రజ్ఞులు కాగలరు, యజ్ఞతపోదానములను ఆచరించుట వలన త్రికరణశుద్ధి (మనస్సు-మాట-శరీరము) కలుగుతుంది. తద్వారా మానవుడు నిర్మల అంతఃకరణుడై స్వయంప్రకాశమైన ఆత్మోదయమును పొందును. కావున ఈ మూడు కార్యములు ఎన్నడూ త్యజించదగినవికావు.




**శ్లోకం : యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్ ।**
**స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః ॥ 18:46 ॥**

**పదవిభాగము:** యతః, ప్రవృత్తిః, భూతానాం, యేన, సర్వం ఇదం, తతమ్
స్వకర్మణా, తం, అభ్యర్చ్య, సిద్ధిం, విందతి, మానవః ॥

**ప్రతిపదార్థము:** **యతః** = ఎవ్వని వలన, **భూతానాం** = సమస్త భూతములకు, **ప్రవృత్తిః** = ఉత్పత్తి (కర్మ ప్రేరణ కలుగుచున్నదో), **యేన** = ఏ భగవంతునిచే, **ఇదం సర్వం** = ఈ సమస్త జగత్తు, **తతం** = వ్యాపింపబడి యున్నదో, **తం** = ఆ పరమేశ్వరుని, **స్వకర్మణా** = తన స్వాభావిక కర్మాచరణము ద్వారా, **అభ్యర్చ్య** = పూజించి, **మానవః** = మానవుడు, **సిద్ధిం** = పరమసిద్ధిని, **విందతి** = పొందుచున్నాడు.

**తాత్పర్యము:** ఏ సర్వాంతర్యామి అయిన పరమేశ్వరుని నుండి ప్రాణుల ఉత్పత్తి మరియు సంసారానుగుణ ప్రవృత్తి కలుగుచున్నదో, ఎవనిచేత సమస్త ప్రపంచము వ్యాపింపబడి ఉన్నదో, అట్టి ఈశ్వరుని మనుజుడు తనకు ఏర్పడిన స్వాభావిక కర్తవ్యకర్మలచే పూజించుట ద్వారా పరమసిద్ధిని పొందుచున్నాడు.

**విశేషార్థము:** మానవునికి స్వభావసిద్ధముగా ఏర్పడిన కర్మానుష్ఠానము ద్వారా భగవంతుని ఆరాధించి జ్ఞానసిద్ధిని ఎట్లు పొందవలెనో భగవానుడు వివరించుచున్నాడు. ఫలాభిలాషతో కర్మ చేసినచో అది మోక్ష హేతువు కానేరదు. కర్మను ఆచరించుచూ ఫలమును ఈశ్వరార్పణ గావింపుము. ఇదియే కర్మ ద్వారా ఈశ్వరుని ఆరాధించు ఉత్తమోత్తమ మార్గము అని భగవానుని ప్రబోధము.




**శ్లోకం : సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥ 18:66 ॥**

**పదవిభాగము:** సర్వధర్మాన్, పరిత్యజ్య, మాం, ఏకం, శరణం, వ్రజ, అహం, త్వా, సర్వపాపేభ్యః, మోక్షయిష్యామి, మా, శుచః

**ప్రతిపదార్థము:** **సర్వధర్మాన్** = సమస్త ధర్మములను (సర్వకర్తవ్య కర్మలను), **పరిత్యజ్య** = నాకు సమర్పించి, **ఏకం** = సర్వశక్తిమంతుడను, సర్వాధారుడను, పరమేశ్వరుడను అయిన, **మాం** = నన్ను, **శరణం వ్రజ** = శరణుజొచ్చుము, **అహం** = నేను, **త్వా** = నిన్ను, **సర్వపాపేభ్యః** = సమస్త పాపముల నుండి, **మోక్షయిష్యామి** = విముక్తుని గావింతును, **మా శుచః** = నీవు శోకింపకుము.

**తాత్పర్యము:** సర్వధర్మములు అనగా నీ సమస్త కర్తవ్యకర్మలను నాకు సమర్పింపుము. సర్వశక్తిమంతుడను పరమేశ్వరుడనైన నన్నే శరణము నొందుము. అన్ని పాపముల నుండి నిన్ను విముక్తుని గావింతును.

**విశేషార్థము:** భగవద్గీతా సందేశములో భగవానుడు కేవలం అర్జునునికే కాక సకల మానవాళికి సాంఖ్య, కర్మ, భక్తి, జ్ఞాన, ధ్యానయోగ మార్గములు, సంసార తరుణోపాయములు బోధించి ఈ మార్గములు అన్నియు అనుసరణీయములే. మానవులు అజ్ఞానవశమున లేక మాయా ప్రభావముచేత, మరే ఇతర కారణములచేతనో ఆచరించ లేకపోతే దిగులు పడవలసిన అవసరము లేదు. అందరికి సులభమైన ఉపాయము ఉన్నది. అది **"ఈశ్వర శరణాగతి"** అనే భక్తి మార్గమును బోధించి ఇది అన్నిటి కంటే గొప్ప రహస్యము. పరమోపాయము అని భగవానుడు స్పష్టీకరించాడు.




సంజయ ఉవాచ

**శ్లోకం** : యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ।
తత్ర శ్రీర్విజయో భూతిః ధ్రువా నీతిర్మతిర్మమ ॥ 18:78 ॥

**పదవిభాగము:** యత్ర, యోగేశ్వరః, కృష్ణః, యత్ర, పార్థః, ధనుర్ధరః, తత్ర, శ్రీః, విజయః, భూతిః, ధ్రువా, నీతిః, మతిః, మమ

**ప్రతిపదార్థము:** **యత్ర** = ఎచ్చటనైతే, **యోగేశ్వరః** = యోగమునకు ప్రభువు అగు, **కృష్ణః** = శ్రీకృష్ణభగవానుడు, **యత్ర** = ఎచ్చటనైతే, **ధనుర్ధరః** = గాండీవమనే ధనుస్సు ధరించిన, **పార్థ** = పార్థుడు అను నరుడు కలడో, **తత్ర** = అచ్చట, **శ్రీ** = సిరిసంపదలును, **విజయః** = సమస్త విజయములు, **భూతిః** = సకలైశ్వర్యములు, **ధ్రువా నీతిః** = దృఢమైన నీతియుండును, (అని) **మమ మతిః** = నా నిశ్చితాభిప్రాయము.

సంజయుడు చెప్పుచున్నాడు.

**తాత్పర్యము:** ఓ ధృతరాష్ట్ర మహారాజా! యోగమునకు ప్రభువైన శ్రీకృష్ణపరమాత్మ, గాండీవ ధనుర్ధారియగు అర్జునుడు ఎక్కడ ఉంటాడో అక్కడ రాజ్యము, విజయము, ఐశ్వర్యము, ఘన వైభవము, నీతి సుస్థిరమైయుండును.

**విశేషార్థము:** భగవద్గీతలో ఆద్యంతము భగవానుడు ప్రకృతి-జీవుడు-పరమాత్మ అనే మూడింటియందు గల పరస్పర సమన్వయ తత్త్వాలను విశదీకరించి ఈ మూడు తత్త్వాలు అద్వితీయము ఏకము అయినట్టి ఒకే పరమేశ్వర తత్త్వము అని వివరించినాడు.

శ్రీకృష్ణార్జున సంవాదమును ప్రత్యక్షముగా చూసిన సంజయుడు దైవ మానవశక్తుల సంయోగముతో అసాధ్యమేదీ లేదని, సర్వత్రా విజయము, ఐశ్వర్యము, సుస్థిరమైన నీతి, సుఖశాంతులు వర్ధిల్లుతాయని చెప్పుచున్నాడు. ఈ శ్లోకము **'ఏకశ్లోక గీత'**గా, **'శాంతి మంత్రము'**గా సకల శుభకార్యములలో వేదవిదులు పఠనము చేస్తున్నారు.

ఈ కార్యక్రమము గురించి మరియు
ఉచిత రిజిస్ట్రేషన్ కొరకు
ఈ క్రింది వెబ్ సైట్ లో చూడగలరు

**www.gitarchana.com**




**మూసాపేట రామరాజు**
వీహెచ్‌పి - అధ్యక్షుడు
ఫోన్ : 98850 00506

**బండారి రమేష్**
వీహెచ్‌పి - కార్యదర్శి
ఫోన్ : 98482 53311

**డా.జి.వెంకటేశ్వర రాజు**
కన్వీనర్
ఫోన్ : 98851 96076


భగవద్గీత చదవండి, చదివించండి, జీవితంలో
ఆచరించండి, ఈ కార్యక్రమంలో తప్పక పాల్గొనండి.